ఈనాడు ఏలూరు
సోమవారం ఆగస్టు 31, 2026 5

తెరచాటు వసూళ్లు.. అందరికీ వాటాలు..

- ఆస్తి పన్ను విధింపులో ఆర్‌వో, ఆర్‌ఐలదే పెత్తనం
- ఏలూరు నగరపాలికలో గుట్టుగా సాగుతున్న వ్యవహారం

ఈనాడు-ఏలూరు: నగర, పురపాలికల్లో నివాస, వాణిజ్య భవనాలకు ఆస్తి పన్ను అనేది వార్డు అడ్మిన్ సెక్రటరీ వేయాలి. వేసిన ఆ పన్ను వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నగరపాలక రెవెన్యూ విభాగం అధికారులకు పంపాలి. అయితే 68 సచివాలయాలు ఉన్న ఏలూరులో ప్రతి వార్డు అడ్మిన్ సెక్రటరీ పాస్‌వర్డు, ఐడీలు నగరపాలక ఆర్‌వో, ఆర్‌ఐలు తమ గుప్పిట పెట్టుకుని వీరే వారి పేరుతో కంప్యూటర్‌లో లాగిన్ అయి పన్నులు వేస్తున్నారు. కొన్నాళ్లుగా ఈ నిర్వాకం సాగుతోంది.

ఓటీపీతో చక్కబెట్టేస్తున్నారు.. ఆస్తి పన్ను విధింపు ప్రక్రియ మొత్తం ఆర్‌వో, ఆర్‌ఐల కనుసన్నల్లోనే జరుగుతోంది. కొత్త భవనాలకు పన్నులు విధించే క్రమంలో కొంచెం తగ్గిస్తామని యజమానులను మభ్యపెట్టి మామూళ్లు దండుతున్నారు. ఈ క్రమంలో అడ్మిన్ సెక్రటరీలకు వచ్చే ఓటీపీలను ఆర్‌వో, ఆర్‌ఐలు తీసుకొని రెండో కంటికి తెలియకుండా అంతా చక్కబెడుతున్నారు. వచ్చిన మొత్తంలో అడ్మిన్ సెక్రటరీలతోపాటు నగర పాలక సంస్థలోని అన్ని స్థాయిల అధికారులకు వాటాలు ఉండటంతో ఎవరూ నోరు మెదపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

అడ్మిన్ సెక్రటరీలే బాధ్యత వహించాలి..

అడ్మిన్ సెక్రటరీలు తమ పాస్‌వర్డ్, ఐడీలు గోప్యంగా ఉంచుకోవాలి. ఒక ఇంటికి ఆస్తి పన్ను విధింపు తొలుత అడ్మిన్ సెక్రటరీ పూర్తి చేసి.. తర్వాత దశకు పంపుతారు. అందులో ఏమైనా హెచ్చు, తగ్గులు ఉంటే డిప్యూటీ కమిషనర్, అదనపు కమిషనర్, కమిషనర్ పరిశీలించి చెబుతారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఇదే విధానం ఉంటుంది. ఏలూరులో పరిస్థితిపై విచారించి చర్యలు తీసుకుంటాం. **- సీహెచ్ నాగ నరసింహారావు, ఆర్డీ, పురపాలకశాఖ**





కేంద్రాన్ని పరిశీలించి బయటకొస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి తదితరులు

నీట్‌గా తీశారు.. లోపలికి పంపారు

పరీక్షకు 377 మంది హాజరు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని రెండు కేంద్రాల్లో నీట్ పీజీ ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు మొత్తం 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఏలూరు సమీప సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో 214కి 213 మంది హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్‌ఈ పాఠశాల కేంద్రంలో 175కి 164 మంది పరీక్ష రాశారు. ఆయా పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వెట్రిసెల్వి తనిఖీ చేశారు. ఆమె వెంట డీఎస్పీ శ్రావణ్ కుమార్, ఏలూరు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఏలూరు, పెదపాడు తహసీల్దార్లు రవీంద్రనాథ్, కృష్ణజ్యోతి తదితరులున్నారు.

నిఘా: ఆయనో బడా బాబు ఆయనదే మతలబు

నలుగురికే పెద్దఎత్తున నామినేషన్ పనులు

అన్నీ తానై నడిపిస్తున్న ఓ నేత

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: వడ్డించేది మనోళ్లయితే ఆఖరి బంతిలో కూర్చున్నా అన్నీ వస్తాయన్న చందంగా ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో కేవలం నలుగురు గుత్తేదారులకే సింహభాగం పనులు కట్టబెడుతున్నారు. నామినేషన్ వర్కుల్లో రూ.13 కోట్లకు పైగా పనులను నలుగురికే కేటాయించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ విషయం బయటకు పొక్కడంతో.. వారెవరు? ఎవరి అండదండలున్నాయి? వీరికి పనులు కట్టబెట్టింది ఎవరు? అన్న ప్రశ్నలు నగర ప్రజలను తొలిచేస్తున్నాయి.

రెండేళ్లలో రూ.25 కోట్ల మేర..

నగరంలో 2024-26 మధ్య రూ.25 కోట్ల మేర అభివృద్ధి పనులు చేశారు. మొత్తం 20 నుంచి 25 మంది గుత్తేదారులకు నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగించారు. ఇందులో నలుగురికి మాత్రం ఏకంగా రూ.13 కోట్ల విలువైన పనులు కేటాయించారు. ఓ గుత్తేదారు రూ.2.60 కోట్లు, ఇంకొకరు రూ.5.36 కోట్లు, మరొకరు రూ.4.25 కోట్లు, నాలుగో గుత్తేదారు రూ.74 లక్షలు పనులు చేపట్టారు.

బినామీలు కావడంతోనే?..

అధిక మొత్తంలో పనులు దక్కించుకున్న గుత్తేదారులు ఓ బడా బాబుకు బినామీలన్న ప్రచారం సాగుతోంది. ఈ కారణంగానే వారికి అధిక ప్రాధాన్యమిచ్చారని తెలుస్తోంది. పనులు పూర్తయ్యాక వాటిని పరిశీలించడం.. నాణ్యతా ప్రమాణాలు బేరీజు వేయడం.. వాటికి ఎంత ఖర్చయిందన్న వివరాలను అధికారులు తెలుసుకోవడం లేదు. కేవలం దస్త్రాలపై సంతకాలు చేసి.. నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకొంటున్నారన్న వాదనలున్నాయి.

నేడు యథావిధిగా 'మీకోసం'

పవరుపేట(ఏలూరు కలెక్టరేట్), న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో.. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీ కోసం) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. మండల, డివిజనల్, పురపాలక కార్యాలయాల్లో కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. వినతుల పరిష్కార స్థితిని తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1100కు ఫోన్ చేయొచ్చని ఆమె ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రత్యేకమన్నారు.. ప్రత్యక్షమవ్వరు!

- శిబిరాలకు హాజరుకాని బీఎల్వోలు
- పలుచోట్ల వెలవెలబోయిన పోలింగ్ కేంద్రాలు



భీమడోలు స్వర్ణ గ్రామ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం-104 ఉండగా.. ఆదివారం తాళం వేసి ఉంది. కొందరు యువకులు ఓటు నమోదుకొచ్చి.. ఎవరూ లేకపోవడంతో వెనక్కి వెళ్లిపోయారు.

ఏలూరు నగరంలోని పలు కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలకు బీఎల్వోలు వేళకు హాజరు కాలేదు. జాబితాలో తమ ఓట్లు సరిచూసుకునేందుకు వచ్చిన ఓటర్లు నిరీక్షించాల్సి వచ్చింది. కేపీడీటీ ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాలుండగా బీఎల్వో ఒకరే విధులు నిర్వర్తించారు. కొన్నిచోట్ల నిర్ణీత సమయానికంటే ముందే బీఎల్వోలు వెళ్లిపోయారు.

చింతలపూడి పట్టణం బాలికోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఎవరూ లేరు. గేటుకు తాళం వేసి ఉంది. పట్టణంలోపాటు గ్రామీణ మండలంలోనూ ఇదే పరిస్థితి కనిపించింది.

జంగారెడ్డిగూడెం పట్టణం పర్రెడ్డిగూడెం, పాత బస్‌స్టాండ్, ఇందిరానగర్ కాలనీ, పాత పురపాలక కార్యాలయం, బుట్టాయగూడెం రోడ్డులోని ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ డిగ్రీ, త్రివేణి కళాశాలలు, అయిదో వార్డులోని ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు కనిపించలేదు. పలు విద్యాలయాలకు తాళాలు వేసి ఉన్నాయి.



ఉంగుటూరు, జంగారెడ్డిగూడెం, ఏలూరు అర్బన్, చింతలపూడి, భీమడోలు- న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. క్షేత్రస్థాయిలో మాత్రం కేంద్రాలు వెలవెలబోయాయి. కొన్నిచోట్ల తాళాలు కూడా తీయలేదు. మరికొన్నిచోట్ల బీఎల్వోలు కనిపించలేదు. ఇంకొన్ని చోట్ల మధ్యాహ్నం వరకు అందుబాటులో ఉండి, ఆపై వెళ్లిపోయారు.

పరిశీలన



ఉంగుటూరు మండలం చేబ్రోలు ప్రాథమిక-1, బాలికోన్నత పాఠశాలల్లో ఆరు పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇక్కడి ప్రత్యేక శిబిరాలను ఆదివారం మధ్యాహ్నం 2.38 నుంచి 2.46 గంటల మధ్య పరిశీలించగా.. అన్ని మూసివేసి కనిపించాయి. బీఎల్వోలు అందుబాటులో లేరు.

అభ్యంతరాల పరిష్కారానికి..

గత నెల 31న విడుదల చేసిన ముసాయిదా అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు, సవరణలు, క్లెయిమ్‌లు, వాటి పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరించేందుకు ఈ నెల 22, 23, 29, 30 (శని, ఆదివారాలు) తేదీల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఓటరు జాబితాలు సరిచూసుకోవడంతోపాటు కొత్త ఓటు నమోదుకు కూడా వెసులుబాటు కల్పించారు. శిబిరాల నిర్వహణపై ప్రజలకు సమాచారం లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అంతంత మాత్రంగానే స్పందన లభించింది.

గందరగోళంగా సమాచారం

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 137 కేంద్రాలు పెరిగాయి. వాటి సంఖ్య 1,881కు చేరింది. దాంతో కేంద్రాల క్రమ సంఖ్యలు మారాయి. దీన్ని చాలా చోట్ల మార్చలేదు. పాతవే దర్శనమిచ్చాయి.

ఇక బడిలోనే చికిత్స

ముదినేపల్లి, ఉంగుటూరు, న్యూస్‌టుడే: పీఎంశ్రీ పాఠశాలల్లో పిల్లల ఆరోగ్యానికి మరింత భద్రత లభించనుంది. పాఠశాలలో ఉన్న సమయంలో ఏ విద్యార్థికైనా చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే చికిత్స, సపర్యలకు సౌకర్యాలు సమకూరనున్నాయి. వీరి ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం 'సిక్ రూమ్'లు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంది. ఒక్కో బడికి దీని నిమిత్తం రూ.5 లక్షల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.



ముదినేపల్లి పీఎంశ్రీ పాఠశాలకు వచ్చిన పరికరాలు

సిక్ రూమ్‌ల ఏర్పాటు.. బడుల్లో ఎంపిక చేసిన సిక్‌రూమ్‌కు అవసరమైన అన్నింటినీ సమకూర్చనున్నారు. బాలబాలికలకు విడివిడిగా చికిత్సలు అందించనున్నారు. పరుపుతో కూడిన మంచం, కుర్చీలు, శానిటైజర్ డిస్పెన్సరీ, వాషింగ్ స్టేషన్ వంటి పరికరాలు ఇప్పటికే పాఠశాలలకు చేరాయి. వీటితోపాటు ఏడాదికి సరిపడే మందులతో ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుతారు. రక్తపోటు, మధుమేహం పరీక్షలకు తోడు బరువు తూచే పరికరాలతో పలు రకాల సామగ్రితో ఈ సిక్ రూమ్ అన్ని వేళలా అందుబాటులో ఉంటుంది. ఆరోగ్య సిబ్బందితో కలిసి పిల్లలకు ప్రాథమిక చికిత్స అందించడం కోసం త్వరలో సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.



తుడిచిపెట్టేస్తున్న తెల్లమచ్చ

65 శాతం విస్తీర్ణంలో రొయ్యల చెరువులు ఖాళీ

ఉండి, న్యూస్‌టుడే: విభిన్న వాతావరణ పరిస్థితులు, వ్యాధుల వ్యాప్తి ఉభయ జిల్లాల్లో రొయ్యల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. నాలుగు నెలల కిందటి వరకు వైట్‌గట్, ఈహెచ్‌పీ, ఇప్పుడు తెల్లమచ్చల(వైట్ స్పాట్) వ్యాధి రొయ్యల చెరువులను తుడిచి పెట్టేస్తున్నాయి. ఉభయ జిల్లాల్లో ఇప్పటికే 65 శాతం విస్తీర్ణంలో పంట దెబ్బతింది. గత ఆరు నెలల వ్యవధిలో సాగుదారులు రూ.1,300 కోట్లకు పైగా నష్టపోయారంటే పరిస్థితి ఏ స్థాయికి చేరిందో స్పష్టమవుతోంది. నాణ్యత లేని సీడ్ వినియోగమే దీనికి ప్రధాన కారణమని ఆక్వా రంగ నిపుణులు చెబుతున్నారు.



ఉండిలో రొయ్యల పట్టుబడి

ఏడెనిమిది సార్లు సీడ్ సేకరణ.. సముద్రం నుంచి సేకరించిన నాణ్యమైన బ్రూడ్ స్టాక్ (తల్లి రొయ్య) నుంచి రెండు పర్యాయాలు విత్తనాన్ని సేకరిస్తే నాణ్యత బాగుంటుంది. ఇలాంటి సీడ్‌కు వ్యాధులు సోకే అవకాశం తక్కువ. కానీ ఒకే తల్లి రొయ్య నుంచి ఏడెనిమిది సార్లు సీడ్ ఉత్పత్తి చేసి రైతులకు విక్రయిస్తున్నాయి. వీటిని రైతులు కొని చెరువుల్లో వేస్తుండగా రోజుల వ్యవధిలోనే రొయ్యలు వైరస్, బ్యాక్టీరియా వ్యాధులకు గురవుతున్నాయి. మరో పక్క మేతల్లో వినియోగించే ఫిష్ మీల్, సోయా, మినరల్స్, విటమిన్స్, ప్రో బయోటిక్స్, ఫిష్ ఆయిల్ నాణ్యతపై సందేహాలు ఉన్నాయి.

ముందస్తు జాగ్రత్తలతో నివారణ.. రొయ్యల సాగులో చెరువు తయారీ నుంచి ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి. తొలుత రిజర్వాయర్‌లోకి నీరు తోడి బ్లీచింగ్, శానిటైజర్స్‌తో శుద్ధి చేసిన తరువాతే చెరువులో నింపాలి. వైట్ స్పాట్ నివారణకు మందుల్లేవు. నాణ్యమైన సీడ్ సేకరించుకొంటే ఈ వ్యాధిని నివారించుకోవచ్చు. ఎకరానికి 60 వేల నుంచి 70 వేల మధ్య రొయ్య పిల్లలు వదులుకోవాలి. వాతావరణ పరిస్థితుల ఆధారంగా నిపుణుల సూచనలు పాటించాలి. చెరువు నీటిలో ఆక్సీజన్ లోటు రాకుండా అవసరమైనన్ని ఏరియేటర్లు వినియోగించాలి. **- వీరభద్రరావు, శ్రీనివాసరావు, మత్స్య శాస్త్రవేత్తలు**

ఉభయ జిల్లాల్లో చెరువుల విస్తీర్ణం (లక్షల ఎకరాలు) ఇలా..


ఆక్వా	రొయ్య	చేప
2.90	1.20	1.70

వార్షిక ఉత్పత్తి: 4 లక్షల టన్నులు

టర్నోవర్: రూ.18 వేల కోట్లు

సీజన్‌కు సీడ్ ఖర్చు: రూ.420 కోట్లు

తమ్మిలేరు..జాగ్రత్త అటువైపు వెళ్లేరు



తమ్మిలేరు జలాశయం లాకుల వద్ద భయానక పరిస్థితి నెలకొంది. లాకులకు ఇరువైపులా నిర్మించిన రక్షణ కట్టడాలు శిథిలమయ్యాయి. సిమెంటు లేచిపోయి ఇనుప చువ్వలు బయటపడ్డాయి. ఇక్కడ ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. లాకులపై నుంచి దిగువకు చూస్తూ ఆనందంగా వీక్షిస్తుంటారు. వరుసగా సెలవులొస్తే లాకుల వద్ద సందర్శకుల తాకిడి కనిపిస్తోంది. - న్యూస్‌టుడే, చాట్రాయి



మనసారా.. మహా సారె

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: శ్రావణ మాసం సందర్భంగా పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్దన స్వామి ఆలయం (సోమారామం)లో సారె మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు కావిళ్లు, ఎడ్ల బళ్లలో దాదాపు 8 వేల కిలోల సారెతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు.

పొట్లకాయ.. ఎంత పొడవో

సాధారణంగా పొట్లకాయ మూడు నుంచి నాలుగు అడుగుల మేర, అదే హైబ్రీడ్ రకమైతే ఆరడుగుల మేర పొడవు పెరుగుతాయి. కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడులో రైతు గెడా దుర్గారావు ఇంటివద్ద పెంచిన పొట్ల పాదుకు పది అడుగుల మేర పెరిగాయి. ప్రస్తుతం కాయలు లేతగానే ఉన్నాయని ఇంకా పొడవు పెరుగుతాయని రైతు చెబుతున్నారు. - న్యూస్‌టుడే, కొయ్యలగూడెం



- సమస్యల పరిష్కారానికి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌తోపాటు మండల, డివిజన్, పురపాలక సంఘ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)కు పెద్దఎత్తున ప్రజలు వస్తుంటారు. మారుమూల ప్రాంత ప్రజలు వ్యయప్రయాసలకోర్చి కార్యాలయాలకొచ్చి వినతులు అందజేస్తుంటారు. అర్జీదారుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో రోజూ పీజీఆర్‌ఎస్ నిర్వహించాలని ఆదేశాలిచ్చింది.

ఇక రోజూ పీజీఆర్‌ఎస్

స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో అమలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సిబ్బందిని సమర్థంగా వినియోగించుకొని.. ప్రజలకు పాలన చేరువ చేయడానికి అడుగులు వేస్తోంది. ఇకపై తమ సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్‌ఎస్ కోసం ఎదురుచూడకుండా స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో రోజూ నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా సమస్యలు సత్వరం పరిష్కరించాలని ఆదేశాలిచ్చింది. జిల్లాలో మొత్తం 605 స్వర్ణ, వార్డు కార్యాలయాలుండగా.. 4,400 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా అధికారి వెంకట నాయుడు

రెండు గంటలపాటు.. స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల సిబ్బంది ఉదయం పూట క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్తుండటంతో.. స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్న ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో సిబ్బంది రోజూ మధ్యాహ్నం కార్యాలయాల్లో ఉండేలా 3 నుంచి 5 గంటల వరకు పీజీఆర్‌ఎస్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. 'రోజూ పీజీఆర్‌ఎస్ ఎలా నిర్వహించాలన్న అంశంపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరిస్తే ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుంది. కార్యక్రమాన్ని ఎంపీడీవోలు, కమిషనర్లు పర్యవేక్షిస్తారు' అని స్వర్ణ గ్రామ, వార్డు జిల్లా అధికారి జి.వెంకట నాయుడు తెలిపారు.

ఉల్లిక్కి పడేలా.. కన్నీరు కార్చేలా!

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: నిత్యావసరాల్లో ఉల్లి లేని ఇల్లంటూ ఉండదు. ఉభయ జిల్లాల్లో ప్రధానమైన తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో ఉల్లిపాయల ధర ఆకాశాన్ని అంటుతుంది. ఆదివారం మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.50 పలికింది. దీంతో సామాన్యులు కొనాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెల వరకు కిలో రూ.25 నుంచి రూ.35 మధ్య ఉంటే ప్రస్తుతం ఒక్కసారిగా ధర పెరగడంతో పరిస్థితి దారుణంగా మారింది. వర్షాభావంతో కర్నూలు ఉల్లి పంట దిగుబడి తగ్గింది. ఏటా ఈ సీజన్‌లో మార్కెట్‌కు రోజూ 5 నుంచి 10 లారీలు రాగా ప్రస్తుతం 2 లారీల సరకు వస్తుంది. మహారాష్ట్ర నుంచి 10 లారీల ఉల్లి రావాల్సి ఉండగా 5 వరకు వస్తుంది. ఈ నేపథ్యంలో ఉల్లి ధర క్రమంగా పెరుగుతుంది.



పెద్దపులి కోసం అన్వేషణ

దాడిలో ఆవు, గేదె దూడ మృతి

పోలవరం, న్యూస్‌టుడే: మూడు రోజులుగా పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల పరిధిలో తిరుగుతున్న పెద్దపులి ఆదివారం ఉదయం పి.రెగ్యులేటర్, దేవరగొంది జంట సొరంగాల పరిసరాల్లో తిరుగుతున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. వెంటనే జలవనరులశాఖ అధికారులతోపాటు మన్యం ప్రతినిధులకు తెలియజేసి హుటాహుటిన అక్కడికి వెళ్లారు. పెద్ద పులి పి.రెగ్యులేటర్ సమీపంలో రెండు గేదె దూడలపై దాడి చేసినట్లు తెలుసుకున్నారు. వాటిలో ఒకటి మరణించగా.. మరొకదానికి గాయం కావడంతో పశువైద్య సిబ్బందిని రప్పించి చికిత్స చేయించినట్లు పోలవరం అటవీశాఖ అధికారి ఎస్కే వలీ చెప్పారు. సిబ్బంది పరిసరాల్లో జరిపిన గాలింపులో ఆవు మృతదేహాన్ని గుర్తించారు. నెలరోజులుగా మండలంలోని ముంపు గ్రామాల్లో మకాం వేసిన పెద్ద పులి తిరిగి ప్రయాణం ప్రారంభించి శనివారం రాత్రి ఇటుకలకోట, మెత్తప్పకోట కొండల్లో ప్రయాణం చేసి తెల్లవారే సరికి పి.రెగ్యులేటర్ వద్దకు చేరుకున్నట్లు ట్రాకర్ ద్వారా గుర్తించారు. పోలవరానికి ఏడు కిలోమీటర్ల దూరంలో పెద్దపులి మకాం వేయడంతో జంటసొరంగాల పనులు చేస్తున్న కార్మికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



దేవరగొంది ముంపు గ్రామం పరిధిలో పులికోసం గాలిస్తున్న అటవీశాఖ అధికారులు

పట్టుకునే పనిలో.. ప్రాజెక్టు పరిసరాల్లో ఉన్న పులిని పట్టుకునేందుకు మత్తు ఇచ్చే షూటర్లు, రెస్క్యూ బృందాలతోపాటు వెటర్నరీ సిబ్బందిని రప్పించారు. రాజమహేంద్రవరం అటవీశాఖ అధికారి దావీద్‌రాజు వారి వెంట వచ్చారు. ప్రాజెక్టులో పనిచేసే కార్మికులు రాత్రి సమయంలో ఒంటరిగా బయటకు రావద్దని అటవీశాఖ సిబ్బంది హెచ్చరించారు.

మన్యంలోకి రాజమార్గం

రెండో ప్యాకేజీ పనులకు రూ.840 కోట్లు మంజూరు

కొయ్యలగూడెం గ్రామీణ, పోలవరం, న్యూస్‌టుడే: జీలుగుమిల్లి- పోలవరం- కొవ్వూరు రెండు లైన్ల జాతీయ రహదారి 365 బీబీ పనులు మరింత వేగవంతం కానున్నాయి. ఇందుకోసం కేంద్రం రూ.840 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల ప్రకటించడం తెలిసిందే. రెండు ప్యాకేజీలుగా నిర్దేశించిన పనుల్లో మొదటిది జీలుగుమిల్లి నుంచి బుట్టాయగూడెం, ఎల్‌ఎన్‌డీపేట మీదుగా పట్టిసీమ వరకు సుమారు 40.4 కి.మీ. పొడవున చేపట్టిన పనుల్లో దాదాపు 50 శాతం పూర్తయ్యాయి. రానున్న అక్టోబరు నాటికి తొలి ప్యాకేజీ పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు ఉన్నారు. రెండో ప్యాకేజీ కింద బుట్టాయగూడెం నుంచి ఎల్‌ఎన్‌డీపేట, పట్టిసీమ మీదుగా కొవ్వూరు వరకు 46.3 కి.మీ. పొడవున రహదారి నిర్మాణానికి 115 హెక్టార్ల భూమిని సేకరిస్తారు. ఇందుకు రూ.90 కోట్లు వెచ్చించనున్నారు. రానున్న పుష్కరాల నాటికి పనులను కొలిక్కి తీసుకురావాలన్న లక్ష్యంతో యంత్రాంగం ఉన్నట్లు తెలుస్తోంది.



వెంకటాపురం, కన్నాపురం కూడలి మధ్య పనుల తీరు



రహదారి పనులు మొదలయ్యే ప్రాంతం

పర్యాటక హబ్‌కు దోహదం.. పోలవరం ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో 365బీబీ రహదారితో కొంత ప్రయోజనం చేకూరనుంది. ఏజెన్సీవాసులు, ప్రాజెక్టు నిర్వాసితులు ఐటీడీఏకు వెళ్లేందుకు అనువైన మార్గం అవుతుంది. పోలవరం, కన్నాపురం, బుట్టాయగూడెం ప్రాంతవాసులకు హైదరాబాదుకు రాకపోకలు మరింత సులభతరమవుతాయి. ప్రాజెక్టును చూడాలని వచ్చే తెలంగాణ వాసులు, కొవ్వూరు వైపు నుంచి వచ్చే సందర్శకులకు దగ్గర దారి అవుతుంది. ముఖ్యంగా జీలుగుమిల్లి నుంచి బుట్టాయగూడెం, కన్నాపురం, పోలవరం మధ్య ప్రాంతాల అభివృద్ధికి దోహదం కానుంది.

భూసేకరణ ప్రక్రియే కీలకం.. రెండో ప్యాకేజీలో ఏటిగట్టు పొడవునా కొత్త రహదారి నిర్మాణానికి అవసరమైన భూమి సేకరించాల్సి ఉంది. మరోవైపు అదే మార్గం వెంబడి డ్రెయిన్ నిర్మించనున్నారు. పట్టిసీమ నుంచి కొవ్వూరు పనులకు ప్రభుత్వ భూమి తక్కువగా ఉండటం అధికారులకు సవాల్ కావచ్చు. బుట్టాయగూడెం-ఎల్‌ఎన్‌డీపేటల మధ్య కొంత మేర ప్రభుత్వ భూమి ఉండటంతో ఆ ప్రాంతంలో పనులకు జాప్యం ఉండకపోవచ్చు. రెండో ప్యాకేజీ పనుల కోసం ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందాల్సి ఉందని ఎన్‌హెచ్ డీఈ శ్రీనివాస్ అన్నారు. ఎల్‌ఎన్‌డీపేట నుంచి పట్టిసీమ మధ్య పనులను వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.


విద్యార్థికి చెక్కు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

చదువుకు పేదరికం అడ్డుకాదు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: చదువుకు పేదరికం అడ్డుకాదన్నారు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఏలూరు యూనిట్ అధ్యక్షుడు కె.కృష్ణారావు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. కృష్ణారావు మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం 22 మంది ప్రతిభావంతులైన పేద పిల్లలకు రూ.3 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి వైద్య సహాయం నిమిత్తం రూ.30 వేలు అందజేశారు. సంస్థ ప్రతినిధులు వి.శేషగిరిరావు, పి.దేవరత్నాకరరావు, పి.పండరీనాథ్, ఏ.మోహని, ఎం.సత్యనారాయణ, కె.సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రయాణం.. కారాదు ప్రమాదం..

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న ఘటనలు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే

రహదారులపై సాఫీగా సాగాల్సిన ప్రయాణాలు వివిధ కారణాలతో ప్రమాదాలుగా మారుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి వచ్చే వరకు కుటుంబ సభ్యులు ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నిత్యం ఏదోమూల రోడ్డు ప్రమాదాలు జరగడమే ఇందుకు నిదర్శనం. ఆయా ప్రమాదాల్లో కొందరి ప్రాణాలు గాల్లో కలిసిపోతుంటే.. మరికొందరు తీవ్ర గాయాలపాలై మంచానికే పరిమితమవుతున్నారు. గతంతో పోలిస్తే ప్రమాదాల సంఖ్య కూడా పెరిగింది.

✷ జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన ఆరుగొల్లు కల్యాణ్ (26), అతడి మిత్రుడు పండు కలిసి ద్విచక్ర వాహనంపై ఈ నెల 25న జి.కొత్తపల్లి వెళ్తుండగా మార్గం మధ్యలో ఎదురుగా వచ్చిన వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో కల్యాణ్ మృతి చెందగా.. మరో యువకుడు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కల్యాణ్‌కు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం వారి కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది.

✷ జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన కె.సాయి మరొక స్నేహితుడితో కలిసి కొద్దినెలల కిందట గ్రీన్ ఫీల్డ్‌పై వస్తుండగా.. ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టారు. ఇద్దరూ శిరస్త్రాణాలు ధరించకపోవడంతో తలకు బలమైన గాయాలై ఘటనాస్థలిలోనే మృతిచెందారు. రెండు కుటుంబాల సభ్యులు తీవ్ర ఇబ్బందులు చవిచూస్తున్నారు.


దేవరపల్లి- తల్లాడ జాతీయ రహదారిపై డ్రమ్ములు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

కుటుంబాలు ఛిన్నాభిన్నం..

మితిమీరిన వేగంతో కొందరు, మద్యం, మాదకద్రవ్యాల మత్తులో మరికొందరు వాహనాలు నడుపుతూ.. ప్రమాదాలు సృష్టిస్తూ ఇతర ప్రయాణికుల జీవితాలను చిదిమేస్తున్నారు. చోదకుల నిర్లక్ష్యం, అవగాహన రాహిత్యంతోపాటు స్వయంకృతాపరాధాలతో చేస్తున్న తప్పులకు మరొకరు బలవుతున్నారు. వీటి వల్ల చిన్న, మధ్య తరగత కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. కుటుంబానికి ఆసరాగా నిలిచిన వ్యక్తిని మృత్యువు కబళిస్తే ఆ కుటుంబం కోలుకోలేని స్థితికి చేరుతుంది.

నియంత్రణకు చర్యలు



'జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలోని బ్లాక్ స్పాట్‌ల వద్ద బారికేడ్లు, డ్రమ్ములు, సూచికలు ఏర్పాటు చేస్తున్నాం. మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. జాతీయ రహదారులపై కూడళ్ళు, రద్దీ మార్గాల్లో ఇరువైపులా వాహనాలు నిలుపుదల చేయకుండా చర్యలు తీసుకోవడంతోపాటు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం' అని డీఎస్పీ బీహెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో మూడేళ్లగా రోడ్డు ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2024	330	153	278
2025	360	170	305
2026	189	81	193

(జులై వరకు)

పీజీఆర్‌ఎస్‌పై అభిప్రాయాలు తెలపండి

పవరుపేట(ఏలూరు కలెక్టరేట్), న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)పై అభిప్రాయాలు తెలపాలని కలెక్టర్ వెట్రిసెల్వి కోరారు. ప్రజలకు మరింత పారదర్శక, జవాబుదారీతనంతో సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీజీఆర్ఎస్ సేవలపై ప్రజాభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా కోరుతోందన్నారు. జిల్లా, మండల స్థాయిలో సోమవారం నిర్వహించే మీ కోసంలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను ఫోన్‌తో స్కాన్ చేసి అభిప్రాయాలు చెప్పాలని ఆమె ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కుడి కాలువలోకి 32 టీఎంసీలు

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటి వరకు 32 టీఎంసీలు కుడి కాలువలోకి తరలించినట్లు పర్యవేక్షణ డీఈ సురేశ్‌బాబు తెలిపారు. ఎత్తిపోతల పథకంలోని 22 పంపుల నుంచి 7,788 క్యూసెక్కులు డెలివరీ సిస్టమ్ నుంచి కుడికాలువలోకి వెళ్తోందన్నారు.

పనులు చకచకా..

సీఎం చంద్రబాబు పర్యటనకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు లేకుండా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి సూచించారు. నరసాపురంలో వచ్చే నెల 1న సీఎం పర్యటించనున్న నేపథ్యంలో అక్కడ చేస్తున్న ఏర్పాట్లను ఆదివారం కలెక్టర్ పరిశీలించారు. అనంతరం స్థానిక లక్ష్మీహరిప్రియ కల్యాణ మండపంలో ఆయా పనుల బాధ్యులు, జిల్లా, డివిజన్ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఆయా ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ అద్నాన్ నయిం అస్మి వెల్లడించారు. కార్యక్రమంలో జేసీ కేఆర్ కల్పశ్రీ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న ప్రజా వేదిక

నరసాపురం పట్టణంలోని పొన్నపల్లి, ప్రధాన మార్గాల్లో, వలందరరేవు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. మొగల్తూరు కుక్కలవారితోటలో చేపట్టిన హెలిప్యాడ్ నిర్మాణం పూర్తికావచ్చింది. పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న లేఅవుట్‌లో క్యాడర్ సమావేశానికి షెడ్డు నిర్మాణం చేస్తున్నారు. పాత కాలువ ప్రాంతంలోని వైజంక్షన్ వద్ద ఉన్న లేఅవుట్‌లో ప్రజావేదిక, స్టాళ్ల ఏర్పాటు తదితర వాటికి షెడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 216 జాతీయ రహదారి నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు అనుసంధాన మార్గాల నిర్మాణాలు జరుగుతున్నాయి.


క్యాడర్ సమావేశానికి ఏర్పాటు చేస్తున్న షెడ్డు

షెడ్యూలు ఇలా..

సీఎం పర్యటనకు సంబంధించి ఆదివారం అధికారులు విడుదల చేసిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం ఉదయం 9.45 గంటలకు ఉండవల్లిలోని ఆయన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరతారు. 10.30 గంటలకు మొగల్తూరులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 10.30 నుంచి 10.40 గంటల వరకూ అధికారులు, ఇతరుల నుంచి వినతులు స్వీకరిస్తారు. 10.40 గంటలకు మొగల్తూరు నుంచి ప్రత్యేక వాహనంలో 216 జాతీయ రహదారి మీదుగా ప్రయాణించి 11.07 గంటలకు నరసాపురం అంబేడ్కర్ కూడలికి చేరుకుంటారు. అంబేడ్కర్ కూడలి నుంచి స్టీమర్ రోడ్డు మీదుగా పొన్నపల్లి వస్తారు. అక్కడ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల లబ్ధిదారులకు నగదు పంపిణీ చేసి కొంత సమయం వారితో ముచ్చటిస్తారు. అనంతరం అక్కడి నుంచి గోదావరిలో బోటుపై ప్రయాణించి 11.45కు వలందరరేవుకు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో మొగల్తూరులోని వైజంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదికకు 12 గంటలకు వస్తారు. 12 గంటల నుంచి 1.40 వరకూ ప్రజావేదిక వద్ద ప్రజలతో సమావేశం, స్టాళ్ల పరిశీలన చేయనున్నారు. మధ్యాహ్నం 1.40 నుంచి 2.50 వరకూ ఆయన ఆహారం తీసుకోవడం, వ్యక్తిగత పనులు(రిజర్వ్) ముగించనున్నారు. మధ్యాహ్నం 2.50కు ప్రజావేదిక వద్ద నుంచి బయలుదేరి 2.55 గంటలకు కార్యకర్తల సమావేశ వేదిక వద్దకు చేరుకుంటారు. 2.55 నుంచి సాయంత్రం 4.25 గంటల వరకూ సమావేశమై వారితో ఫొటోలు దిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి 4.25 గంటలకు రోడ్డు మార్గం నుంచి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.20 గంటలకు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసానికి చేరుకుంటారని అధికారులు వెల్లడించారు.

బాడీ బిల్డింగ్‌తో జాతీయ గుర్తింపు

గుడివాడ, న్యూస్‌టుడే: బాడీ బిల్డింగ్ ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. కృష్ణా జిల్లా గుడివాడలోని ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో ఎన్టీఆర్ మెమోరియల్ ఆంధ్రప్రదేశ్ ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. నేటి సమాజంలో తగిన వ్యాయామం లేక చాలా మంది జీవన శైలి వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టేడియంలో 14 క్రీడాంశాలలో ఏడాది పొడవునా శిక్షణ ఇస్తూ జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ పోటీలలో మిస్టర్ ఆంధ్రప్రదేశ్ టైటిల్‌ను ఏలూరు జిల్లాకు చెందిన కె.పూర్ణచంద్రరావు, ద్వితీయ స్థానాన్ని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఎస్.నాగేంద్ర కైవసం చేసుకున్నారు. విజేతలకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు.


విజేతలు పూర్ణచంద్రరావు, నాగేంద్రలతో ఎమ్మెల్యే రాము, యలవర్తి తదితరులు

మహోన్నత వ్యక్తిత్వం కృష్ణబాబు సొంతం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: మచ్చలేని మహోన్నత వ్యక్తిత్వం కృష్ణబాబు సొంతమని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గ కృష్ణబాబు అభిమాన సంఘం ఆధ్వర్యంలో గామన్ వంతెన కూడలిలో ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకటకృష్ణారావు (కృష్ణబాబు) విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. దొమ్మేరులో బస్ స్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆంధ్రా సుగర్స్ సీఎండీ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, కృష్ణబాబు విగ్రహాన్ని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సంస్మరణ సభలో 'జమిందారు నుంచి జనం మనిషిగా ఎదిగిన ప్రజానేత' పేరిట ముద్రించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ మంచి, మానవత్వానికి కృష్ణబాబు ప్రతిరూపమన్నారు. ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, చింతమనేని ప్రభాకర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ మంత్రి పీతల సుజాత, శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, కృష్ణబాబు కుటుంబ సభ్యులు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు. చిత్రంలో అచ్చిబాబు, తుమ్మల నాగేశ్వరరావు, కందుల దుర్గేశ్, రఘురామ కృష్ణరాజు, కామినేని శ్రీనివాస్ తదితరులు

బాస్కెట్‌బాల్.. కొలువే గోల్!

జాతీయ స్థాయి పతకాలే లక్ష్యంగా ముందుకు

ఏలూరు నగరం, పెదవేగి- న్యూస్‌టుడే: సంకల్పం ఉండాలే గానీ.. లక్ష్య సాధనకు పేదరికం, ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాదని నిరూపిస్తున్నారా యువతులు. పాఠశాల స్థాయిలోనే బాస్కెట్‌బాల్ క్రీడపై ఆసక్తి పెంచుకొని.. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. శిక్షకుడు కె.మురళీకృష్ణ ప్రోత్సాహం, కుటుంబ సభ్యుల సహకారంతో కఠోర సాధన చేస్తూ.. రోజురోజుకూ రాటుదేలుతున్నారు. తాజాగా తిరుపతి వేదికగా నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026లో అండర్-23 మహిళా బాస్కెట్‌బాల్ ఛాంపియన్లుగా నిలిచిన ఏలూరు క్రీడాకారిణులపై కథనం.

స్వర్ణం సాధించా..



నా పేరు బాడిత దేవిశ్రీ. డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. నాన్న దుర్గాప్రసాద్ ముఠా కార్మికుడు. అమ్మ కుమారి గృహిణి. ఎనిమిదో తరగతి నుంచే బాస్కెట్‌బాల్ ఆడుతున్నా. రెండేళ్ల కిందట రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణం సాధించా. రాజస్థాన్‌లో నిర్వహించిన అండర్-19 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని త్రుటిలో పతకం కోల్పోయా. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో పతకాలు కైవసం చేసుకొని.. బ్యాంకింగ్ రంగంలో కొలువు సాధిస్తా.

అద్భుత ప్రదర్శనతో..



నా పేరు ద్వారపురెడ్డి సాయి భవాని. డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. నాన్న సత్యనారాయణ కూలి. అమ్మ లత టైలరింగ్ చేస్తారు. విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రదర్శనతో స్వర్ణం సాధించా. పంజాబ్, పుదుచ్చేరి, రాజస్థాన్‌లలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించా. తాజాగా అమరావతి ఛాంపియన్‌షిప్-2026 విజేతగా నిలవడం మరువలేని అనుభూతి. భవిష్యత్తులో క్రీడా కోటాలో ప్రభుత్వ కొలువు సాధించడమే లక్ష్యం.

రైల్వే ఉద్యోగమే..



నా పేరు నందనపు రేణుక దేవి. డిగ్రీ ప్రథమ సంవత్సరం అభ్యసిస్తున్నా. నాన్న రమణబాబు పచారీ కొట్టులో పని చేస్తారు. అమ్మ నాగమణి గృహిణి. ఏడో తరగతి నుంచే బాస్కెట్‌బాల్ ఆడుతున్నా. వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రజత, కాంస్య పతకాలు సాధించా. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించడమే ధ్యేయంగా సాధన చేస్తున్నా. క్రీడా కోటాలో రైల్వే ఉద్యోగం సాధించడమే నా ఆశయం.



గుబ్బల మంగమ్మ గుడికి భక్తుల తాకిడి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడికి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అడవిలోని వృక్షాల కింద వంటలు వండుకుని సహపంక్తి భోజనాలు చేశారు.

ఆసనం.. ఆరోగ్య జీవన సోపానం

నిత్య సాధనతో పోటీల్లో రాణిస్తున్న మహిళలు

ఆగిరిపల్లి, నూజివీడు, న్యూస్‌టుడే: ప్రస్తుతం చిన్నారుల నుంచి పెద్దల వరకు తమ దైనందిన జీవితంలో ఒత్తిడికి గురవుతున్నారు. చాలా మంది అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఇంటి బాధ్యతలు, పిల్లలు, ఉద్యోగంతో మహిళలకు ఎక్కువ మంది ఒత్తిడికి లోనవుతూ, అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య నివారణ యోగాభ్యాసంతోనే సాధ్యమని పలువురు మహిళలు చెబుతున్నారు. కొందరు నిత్య సాధన చేస్తూ, పోటీల్లోనూ రాణిస్తున్నారు.

యోగాపై పట్టు సాధించి..

నా పేరు బి.పద్మశ్రీలత. నేను యోగాపై పట్టు సాధించి రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో రెండో బహుమతి పొందాను. చిన్నారులకు యోగా ఉచిత శిక్షణ ఇస్తూ.. మంచి ఆరోగ్యానికి బాటలు వేస్తున్నా. ఆరోగ్య పరిరక్షణకు యోగా అవసరం ఎంతో తెలియజెబుతూ ప్రజలకు యోగాపై ఆసక్తిని కలిగిస్తున్నా. సమాజానికి మేలు చేకూర్చే లఘు నాటిక రచనలు చేస్తున్నా. చిన్నారులతో నాటక ప్రదర్శనలు చేయిస్తూ.. ప్రజల్లో అనేక అంశాలపై అవగాహన, చైతన్యం కలిగించే దిశగా కృషి చేస్తున్నా.



ఒత్తిడి లేని జీవితం...



నా పేరు సగ్గుర్తి కమల. నేను ప్రతిరోజు నడకతో పాటు యోగాసనాలు సాధన చేస్తున్నాను. యోగా వల్ల ప్రయోజనాలు తెలుసుకుని అందిరికీ అవగాహన కలిగిస్తున్నా. యోగా సాధనతో ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా జీవిస్తున్నాం. రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ద్వితీయ స్థానం సాధించా. అనేక మందికి యోగా వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తున్నా.

ఎన్నో ప్రయోజనాలు..



నా పేరు జ్యోతి కుమారి. నేను యోగా టీచర్‌గా పనిచేస్తున్నా. వయసుతో సంబంధం లేకుండా అందరూ యోగా సాధన చేయాలి. నిత్యం యోగా చేస్తే... రోజువారీ కార్యక్రమాలు, విధుల్లో ఏకాగ్రత, చురుకుదనంతో పనిచేస్తారు. రక్త ప్రసరణ క్రమబద్ధం అవుతుంది. ఎలాంటి జబ్బులు దరిచేరవు. ఇది అందరికి ఉపయోగం. రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించా.


ప్రారంభోత్సవంలో శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యేలు పితాని, ఆరిమిల్లి తదితరులు

తిరుమల తరహాలో వాడపల్లి క్షేత్రం అభివృద్ధి

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం వాడపల్లి ఆలయ ప్రాంగణంలో శ్రీవకుళమాత అన్నదాన భవన ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. నూతన అన్నదాన భవనంలో ఒకేసారి 3వేల మందికి భోజనాలు, ఆధునిక పరికరాలతో రోజుకు సుమారు 40 వేల మందికి ప్రసాదం సిద్ధం చేసేలా సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. సభాధ్యక్షుడు, ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ.. ఆలయానికి సునాయాసంగా చేరుకునేందుకు రూ.8 కోట్లతో రావులపాలెం నుంచి ఏటిగట్టు రహదారి అభివృద్ధి చేయనున్నామని, ఇందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రూ.6 కోట్లు నిధులు అందజేశారన్నారు. అన్నదాన భవనానికి పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.1.50 కోట్లు ఇచ్చారని, భవిష్యత్తులో మరో రూ.50 లక్షలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. తణుకు, ఆచంట ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకష్ణ, పితాని సత్యనారాయణ, పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామరాజు తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రాలు ప్రదర్శిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఉపాధ్యాయ సమస్యలపై 3న చలో విజయవాడ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: సర్వీసులోని ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని కోరుతూ.. సెప్టెంబరు 3న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో కార్యక్రమ గోడపత్రాలను ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలంటూ తమ సంఘం ఆధ్వర్యంలో అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. వాటికి ప్రభుత్వం స్పందించకపోవడంతో చలో విజయవాడకు పిలుపునిచ్చామని చెప్పారు. పెద్ద సంఖ్యలో సంఘ నాయకులు, ఉపాధ్యాయులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. కృష్ణా, గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.హనుమంతరావు, కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ పూర్వపు ఎమ్మెల్సీ బి.నాగేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు బి.సుభాషిణి, ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 257.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రైవేటు రంగ సంస్థల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రైవేటు రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఆగిరిపల్లిలోని మంగళపూడి నాగేశ్వరరావు భవన్‌లో సామాజిక శాస్త్రవేత్తల సదస్సును ఆదివారం నిర్వహించారు. సోషలిస్టు కూటమి జాతీయ కార్యదర్శి ఎల్.జె.బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రైవేటు ఉపాధ్యాయులు, ఉద్యోగుల వేతన చట్టం బిల్లు పార్లమెంట్‌లో పెట్టాలని, విద్యా సంస్థల్లో విద్యార్థి ఎన్నికలు తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.నాగేశ్వరరావు, ఎల్.సాధు సుందర్‌సింగ్, వంగా రవికుమార్, కడప, కర్నూలు, అనంతరపురం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణ

ఈనాడు డిజిటల్, భీమవరం: పెంటపాడు మండలం ప్రత్తిపాడులో లెవెల్ క్రాసింగ్ నం.376 స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) నిర్మాణానికి భూసేకరణ చేపడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. భూసేకరణపై అభ్యంతరాల కోసం ఈ ఏడాది మేలో నోటిఫికేషన్ విడుదల చేయగా ప్రజల నుంచి ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడంతో భూసేకరణ కోసం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 51 సర్వే నంబర్లలో 1.885 ఎకరాలు సేకరించనున్నారు. ఇందులో వ్యవసాయ భూములతోపాటు ఇళ్లు, దుకాణాలు, ఆలయాలు, వివిధ రకాల చెట్లు ఉన్నాయి.

బెల్లం ధరలతో ఆక్వాలో సెగలు

- 50 కిలోల బస్తాకు రూ.400 వరకు పెరుగుదల
- రైతులపై అదనపు భారం

మండవల్లి, న్యూస్‌టుడే: బెల్లం ధరలు పెరుగుదల ఆక్వా రంగాన్ని కలవరపెడుతున్నాయి. చేపలు రొయ్యల చెరువుల్లో నీటి నాణ్యతను మెరుగు పరచడంతో పాటు ఆమ్ల, క్షార గుణాల నియంత్రణకు బెల్లాన్ని తరచూ వాడుతుంటారు. ప్రో బయాటిక్స్ పెంచేందుకు ఆక్వా సాగులో బెల్లాన్ని వినియోగిస్తారు. తాజాగా మార్కెట్‌లో బెల్లం ధరలు పెరగడంతో చెరువులకు ఉపయోగించే బెల్లం ధరలు సైతం ఆకాశాన్ని తాకుతున్నాయి. పెరిగిన సాగు వ్యయాలతో సతమతమవుతున్నా రైతులకు మరింత భారం పడుతోంది.


చెరువుకు ఉపయోగించే బెల్లం

కృత్రిమ కొరతతో ఇబ్బందులు

ఆక్వాలో చేపలు, రొయ్యల ఆరోగ్యానికి నీటి నాణ్యత ఎంతో కీలకం. నీటిలో పీహెచ్(ఆమ్లత్వం), ఆల్కనిటీ(క్షారత్వం) సూక్ష్మ జీవులు సమతుల్యతను కాపాడేందుకు బెల్లం ఉపయోగపడుతుంది. కానీ ప్రస్తుతం ధరలు పెరగడంతో మార్కెట్‌లో ఒక్కసారి దళారులు కృత్రిమ కొరతను సృష్టించి మరింతగా ధరలు పెంచేందుకు యత్నిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలో 2.8 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు ఉండగా అందులో 1.2 లక్షల ఎకరాలు రొయ్యల చెరువులు, 1.6 ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. ప్రతి నెలా 400 టన్నుల బెల్లం చెరువుల్లో వినియోగంతో పాటు 1.2 లక్షల లీటర్ల మొలాసిస్‌ను వినియోగిస్తున్నారు. పెరిగిన ధరలతో ఉమ్మడి జిల్లా రైతులకు రూ.60 లక్షల వరకు అదనపు భారం పడుతోంది.

నెల వ్యవధిలోనే..

జులై నెల చివరి వారం వరకు రూ.1300 ఉండే 50 కేజీల చెరువు బెల్లం ధర ప్రస్తుతం రూ.1700కు చేరింది. మరోపక్క చక్కెర కర్మాగారాల నుంచి కొనుగోలు చేసే మొలాసిస్ ధరలు సైతం వెయ్యి లీటర్లకు రూ.2000 నుంచి 3000 వరకు పెరిగాయి. బెల్లం ధరల పెరుగుదల నేరుగా ఉత్పత్తి వ్యయంపై పడుతుండడంతో రైతుకు మింగుడు పడటం లేదు.

ధరలు నియంత్రించాలి

ఇప్పటికే మేతలు, మందులు, కూలీల ఖర్చు, చెరువుల లీజులు పెరిగిపోయాయి. తాజాగా బెల్లం ధరలు పెరగడంతో భారం మరింతగా పెరుగుతోంది. సాగుకు అవసరమైన బెల్లం సరఫరాలో పారదర్శకతను తీసుకువచ్చి ధరల పెంపును అడ్డుకోవాలి. - **నాగరాజు, రైతు, మండవల్లి**

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



భీమడోలు, న్యూస్‌టుడే: స్థానిక గీతాంజలి కళాశాలలో ఆదివారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఏలూరుకు చెందిన కరాటే గురువు ఇబ్రహీం బేగ్ పర్యవేక్షణలో విద్యార్థులు పంచ్‌లు, కిక్‌లు, కటా, కుమిటే, ఆత్మరక్షణ పద్ధతుల్లో తమ ప్రతిభను కనబరిచారు. వారికి బెల్టులు, ధ్రువపత్రాలు అందజేశారు. శిక్షకుడు కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం



విద్యార్థినులతో సీఐలు, సిబ్బంది

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ తొలి ప్రాధాన్యమిస్తోందని సీఐలు సుబ్బారావు, కోటేశ్వరరావు అన్నారు. స్థానిక సీఆర్ రెడ్డి మహిళా కళాశాల వసతి గృహంలో విద్యార్థినులకు నూతన చట్టాలు, శక్తి యాప్‌తో కలిగే ఉపయోగాలు, సైబర్ మోసాలపై అప్రమత్తత తదితరాలపై ఆదివారం సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సైబర్ మోసాలకు గురైతే టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫిర్యాదు చేయాలన్నారు.

నియంత్రిక.. పాదులు తొలగించక



ఉంగుటూరు మండలం చేబ్రోలులో ఏలూరు కాలువ గట్టు (పోలీస్‌స్టేషన్ రోడ్డు)పై ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రిక చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి చిట్టడవిని తలపిస్తోంది. దీనికితోడు పాదులు అల్లుకుపోయాయి. రాత్రివేళ విద్యుత్తు సరఫరా నిలిచిపోతే బాగు చేయడానికి సిబ్బంది వెనకడుగు వేస్తున్నారు. - న్యూస్‌టుడే, చేబ్రోలు(ఉంగుటూరు)

వంతెన.. కొరవడిన రక్షణ



ఏలూరు నగరంలో తమ్మిలేరుపై నిర్మించిన బాలయోగి వంతెనకు ఇరువైపులా రక్షణ దిమ్మెలు, ఇనుప పైపులు దెబ్బతిన్నాయి. వంతెన మీదుగా రోజూ వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రివేళ ద్విచక్ర వాహనదారులు, బాటసారులు అదుపు తప్పి తమ్మిలేరులో పడి గాయాలపాలవుతున్నారు. - న్యూస్‌టుడే, ఏలూరు నగరం

కడతారా.. మిన్నకుంటారా..

ఉంగుటూరు మండలం నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వం గుత్తేదారుకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో.. శ్లాబు దశలోనే అర్ధాంతరంగా పనులను ఆపేశారు. - న్యూస్‌టుడే, నారాయణపురం



తవ్వారు.. మరమ్మతులు మరిచారు



గణపవరం మండలం మొయ్యేరులో గత ప్రభుత్వ హయాంలో పైపులైన్ నిర్మాణానికి సీసీ రహదారి మధ్యలో వదిలేశారు. పైపులైన్ నిర్మాణం పూర్తి చేసినా, రహదారికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయలేదు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - న్యూస్‌టుడే, గణపవరం

పునాది వేసి.. మధ్యలో వదిలేసి



నిడమర్రు మండలం పెదనిండ్రకొలను పశు వైద్యశాల పక్కన రైతు సేవా కేంద్రం భవన నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో పునాది వేశారు. గుత్తేదారుకు సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడంతో అసంపూర్తిగా వదిలేశారు. పాడి రైతులు తమ పశువుల్ని నిడమర్రుకు తోలుకెళ్లి చికిత్స చేయించాల్సి వస్తోంది. - న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ? ద్వారకానగర్ గణేశ్ అపార్ట్‌మెంట్ వద్ద రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. ఎదురొచ్చే వాహనాలకు దారిచ్చే క్రమంలో ఇబ్బంది కలుగుతోంది. - రమేశ్, వాహనదారుడు

✔ పిచ్చిమొక్కలు తొలగిస్తాం. - భానుప్రతాప్, నగర కమిషనర్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? మాదేపల్లి రోడ్డులోని సుంకర వారితోట రైసు మిల్లుల వద్ద రహదారి పక్కన చెత్తాచెదారం పడేస్తున్నారు. దాన్ని దహనం చేస్తుండటంతో విపరీతంగా పొగ వస్తోంది. స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. - గోవర్ధన్, స్థానికుడు

✔ వ్యర్థాలు వేయకుండా చూస్తాం. - శ్రీనివాస్, అదనపు కమిషనర్

? చాటపర్రు జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో తాగునీటి సరఫరా వాల్వ్ లీకేజీ అవుతోంది. రోజుల తరబడి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. - రంగారావు, చాటపర్రు

✔ మరమ్మతులు చేయిస్తాం. - వర్మ, పంచాయతీ అభివృద్ధి అధికారి

పెదవేగి, న్యూస్‌టుడే: ? గార్లమడుగు నుంచి రాట్నాలగుంటకు వెళ్లే జడ్పీ రహదారిని ఇటీవల నిర్మించారు. మలుపుల్లో సూచికలు ఏర్పాటు చేయలేదు. ఎదురొచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. - ప్రకాశ్, చోదకుడు

✔ సూచికలు ఏర్పాటు చేస్తాం. - నూకేశ్, పీఆర్ ఏఈ

? వంగూరు లక్ష్మీపురంలో ఇటీవల కొత్తగా విద్యుత్తు తీగలు లాగారు. వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రివేళ అంతటా అంధకారం అలముకుంటోంది. - దినేశ్, గ్రామస్థుడు

✔ దీపాల ఏర్పాటు చేయిస్తాం. - నాగేంద్రకుమార్, ఎంపీడీవో

ఉదయం తీసి.. మధ్యాహ్నం మూసి!

నామమాత్రంగా ప్రత్యేక శిబిరాలు

పరిశీలన

- గ్రామం: ఉంగుటూరు
- పోలింగ్ కేంద్రం నంబరు: 29
- ఎక్కడ: పంచాయతీ కార్యాలయం
- సమయం: మధ్యాహ్నం 2:57 గంటలకు



- సరిపల్లె
- 226, 227, 228, 229
- ప్రాథమిక పాఠశాల-1
- రోజంతా కేంద్రాలకు తాళం



ఉంగుటూరు, భీమడోలు, గణపవరం- న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో భాగంగా ఆదివారం పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. క్షేత్రస్థాయిలో ఆ ఆదేశాలు అమలు కాలేదు. చాలా చోట్ల బీఎల్వోలు జాడే కనిపించలేదు. ఇంకొన్ని చోట్ల ఉదయం పోలింగ్ కేంద్రాలు తీసి.. మధ్యాహ్నానికే మూసేశారు. ప్రభుత్వ పాఠశాలల కేంద్రాల్లో తాళాలు తీయకపోవడంతో ఓటర్లు నిరాశగా వెనుతిరిగారు. 'న్యూస్‌టుడే' పరిశీలనలో ఈ విషయం తేటతెల్లమైంది.

- భీమడోలు
- 101
- ప్రాథమిక పాఠశాల-3
- మధ్యాహ్నం 3 గంటలకు



- చేబ్రోలు • 61
- ప్రాథమిక పాఠశాల, సాయిరాంపేట
- మధ్యాహ్నం 2:41 గంటలకు



నియోజకవర్గ వివరాలిలా..

మండలం	కేంద్రాలు	పురుషులు	మహిళలు
ఉంగుటూరు	77	30,199	31,288
భీమడోలు	59	24,498	25,861
నిడమర్రు	44	18,104	18,205
గణపవరం	65	24,175	24,606

☛ గణపవరానికి చెందిన గంగుమోగుల నాగమణి భర్త మూడేళ్ల కిందట మరణించారు. చిన్నాచితకా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించే భర్త మృతితో ఆమె జీవితం తలకిందులైంది. అటు కూలి పనులకు వెళ్లలేక, ఇళ్లలో పని చేసే శక్తి లేక వితంతు పింఛనుకు ఆశగా ఎదురు చూస్తున్నారు.

☛ భీమడోలు మండలం కురెళ్లగూడేనికి చెందిన ఈగలపాటి కిరణ్మయి భర్త రెండేళ్ల కిందట మృతి చెందారు. వారికి సెంటు వ్యవసాయ భూమి లేకపోయినా.. ఆన్‌లైన్‌లో ఏడెకరాలు ఉన్నట్లు చూపడంతో తల్లికి వందనం నగదు సైతం జమ కాలేదు. వితంతు పింఛనుకు కోసం ఏడాదిన్నర కిందట దరఖాస్తు చేసినా ఇప్పటికీ మంజూరు కాలేదు.

సామాజిక పింఛన్.. త్వరలో వచ్చేన్

కొత్త వాటికి సెప్టెంబర్ నుంచి దరఖాస్తుల స్వీకరణ

గణపవరం, భీమడోలు, నిడమర్రు గ్రామీణ, ఉంగుటూరు- న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సామాజిక పింఛన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలు పెంచింది. ఏడాది పాలన పూర్తయ్యాక స్పౌజ్ పింఛన్లకు లైన్ క్లియర్ చేసింది. తాజాగా రెండేళ్ల పాలన పూర్తయిన నేపథ్యంలో.. కొత్తగా వితంతు, వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్లు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల కొత్త పింఛన్లకు పచ్చ జెండా ఊపడంతో ఆశావహుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. సెప్టెంబర్ నుంచి దరఖాస్తులు స్వీకరించి అక్టోబర్ లేదా నవంబర్ నుంచి పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం అడుగులేస్తోంది.

మొత్తం 3,902 దరఖాస్తులు.. ఉంగుటూరు నియోజకవర్గంలో 3,902 మంది వితంతు, వృద్ధాప్య పింఛన్లకు దరఖాస్తు చేసుకున్నారు. తొలుత వితంతు, తర్వాత వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయనున్నారు. వీరిలో అర్హులెందరున్నారో తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. అర్హుల జాబితా పూర్తయ్యాక నియోజకవర్గంలో ఎంత మందికి లబ్ధి చేకూరుతుందో నిర్ణయం తీసుకోనున్నారు. ఎట్టకేలకు పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ముందడుగు వేయడంపై ఆశావహులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో దరఖాస్తు చేశారిలా..

మండలం	వితంతు	వృద్ధాప్యం
గణపవరం	396	711
నిడమర్రు	176	514
ఉంగుటూరు	364	806
భీమడోలు	352	583

'ఇంటింటికీ తెదేపా' పూర్తి: గన్ని

భీమడోలు, న్యూస్‌టుడే: ఉంగుటూరు నియోజకవర్గంలో రెండేళ్ల నమ్మకం- అభివృద్ధి- సంక్షేమం పేరిట నిర్వహించిన ఇంటింటికీ తెదేపా కార్యక్రమం వంద శాతం పూర్తయినట్లు ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎనిమిది, జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఇందుకు కృషి చేసిన తెదేపా శ్రేణులకు ధన్యవాదాలు తెలుపుతూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అన్నదాతల అభ్యున్నతికి తోడ్పాటు



రైతుకు పాసుపుస్తకం ఇస్తున్న ప్రభాకర్

గోపన్నపాలెం(దెందులూరు), న్యూస్‌టుడే: రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందన్నారు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్. 'మీ భూమి- మీ హక్కు'లో భాగంగా గోపన్నపాలెంలో రైతులకు ఆదివారం నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేశారు. రెవెన్యూ అధికారులు, వీఆర్వోల నుంచి ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకోవాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల భూములకు చట్టబద్ధత కల్పించడమే సర్కారు లక్ష్యమన్నారు. భూముల రీ సర్వేలో భాగంగా గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్ది రాజముద్రతో పాసుపుస్తకాలు అందజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తహసీల్దారు సుమతి, సొసైటీ ఛైర్మన్లు కొండయ్య చౌదరి, మోహన్, వెంకటరత్నం నాయుడు, నాయకులున్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం



సమావేశమైన మహేశ్ కుమార్, చంటి, వీరాంజనేయులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా శ్రేణులు పని చేయాలని తెదేపా జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపునిచ్చారు. నగర సమీప సీతారాంపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంపీ విడిది కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఎంపీ మహేశ్ కుమార్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, కైకలూరు, చింతలపూడి ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, రోషన్ కుమార్‌లతో బడేటి సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల ఎంపిక, వారి విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.

ఎంఈవో సేవలు ఎనలేనివి: డీఈవో



ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న అతిథులు

దెందులూరు న్యూస్‌టుడే: విద్యా రంగానికి ఎంఈవో ప్రసాద్ సుదీర్ఘ కాలం ఎనలేని సేవలందించారని డీఈవో వెంకట లక్ష్మమ్మ కొనియాడారు. స్థానిక హేలాపురి బ్రాహ్మణ కల్యాణ మండపంలో ప్రసాద్ ఉద్యోగ విరమణ సభ ఆదివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. అంకితభావంతో 37 ఏళ్లపాటు విధులు నిర్వర్తించారన్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా, ఎంఈవోగా పని చేసి.. విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటునందించారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఎంఈవోలు భాస్కర్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు ప్రాంత ప్రజల ఉన్నతికి కృషి



మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: కొల్లేరు ప్రాంత ప్రజల ఉన్నతికి, బీసీల అభ్యున్నతికి జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని ఏపీ వడ్డీల సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. యువత రాజకీయాల్లో రావాలని, స్థానిక ఎన్నికల్లో వారికి ప్రాధాన్యమిస్తానని పవన్ కల్యాణ్ వెల్లడించారన్నారు. దెందులూరు నియోజకవర్గంలో 2019 నుంచి ఇప్పటి వరకు పార్టీ బలోపేతానికి శ్రమించిన జన సైనికుల వివరాలను కేంద్ర కార్యాలయానికి పంపామని చెప్పారు. పార్టీలో ఎటువంటి విభేదాలు లేవని, అందరూ కలిసికట్టుగా జనసేనను పటిష్ఠం చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో మూడ్రోజులపాటు అధినేత జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

సామాజిక సేవలతోనే గుర్తింపు



విద్యార్థికి చెక్కు ఇస్తున్న మానవత సభ్యులు

నిడమర్రు, న్యూస్‌టుడే: సామాజిక సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు లభిస్తుందని మానవత సంస్థ నాయకుడు సాగిరాజు జానకిరామరాజు అన్నారు. పెదనిండ్రకొలను వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం సంస్థ సమావేశం నిర్వహించారు. మండలాధ్యక్షుడు నిమ్మల సాంబమూర్తి అధ్యక్షత వహించారు. రీజియన్ ఛైర్మన్ సంకు సత్య కుమార్ మాట్లాడుతూ.. మానవతా సంస్థ సభ్యుల సంఖ్య మరింత పెంచాలని సూచించారు. అనంతరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన దేవరగోపవరం విద్యార్థి మద్దిపట్ల దుర్గాచందు ప్రశాంత్‌కు ఆర్థిక సాయం చెక్కు అందజేశారు. ప్రతినిధులు రత్నశేషారావు, అంతర్వేది, అచ్యుత రామారావు, శ్రీనివాసరావు, లాలయ్య, అప్పారావు పాల్గొన్నారు.

నారాయణపురం: చేబ్రోలులో మానవత మండల సమావేశం నిర్వహించారు. దొంతల విజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఉమ్మడి జిల్లా ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ సాగిరాజు జానకి రామరాజు మాట్లాడుతూ.. మండలంలో మానవత సభ్యత్వాలను 500కు పెంచుకోవాలని కోరారు. ప్రతినిధులు గోపి, శ్రీనివాస్, అప్పారావు, సర్వేశ్వరరావు, సతీశ్, సత్యనారాయణ, రవి, విష్ణు, జయలక్ష్మి, వంశీకృష్ణ, రాజారావు పాల్గొన్నారు.

సమయం లేదు మిత్రమా!

నేటితో ముగియనున్న ఈకేవైసీ గడువు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వంట గ్యాస్ కనెక్షన్ లబ్ధిదారులతోపాటు వారిలో అర్హులను గుర్తించేందుకు చేపట్టిన ఈకేవైసీ గడువు సోమవారంతో ముగియనుంది. తొలుత ఈ నెల 23 వరకు ప్రభుత్వం గడువు విధించింది. అప్పటికి కొన్ని అపరిష్కృతంగా ఉండటంతో.. 31 వరకు గడువు పొడిగించారు. ప్రక్రియ పూర్తి చేసుకోకుంటే గ్యాస్ కనెక్షన్లు తాత్కాలికంగా నిలిపి వేస్తామని అధికారులు చెబుతున్నారు.

నకిలీల గుర్తింపునకు.. నకిలీలు, బినామీలను తొలగించి, అర్హులైన వినియోగదారులను గుర్తించేందుకు చమురు, ఇంధన కంపెనీలు ఈకేవైసీ తప్పనిసరి చేశాయి. గడువులోపు ప్రక్రియ పూర్తి చేయించుకోవాలని వినియోగదారుల ఫోన్లకు సంక్షిప్త సందేశం పంపాయి. వినియోగదారులు ఏజెన్సీల వద్దకు ఒక్కసారిగా చేరుకోవడంతో రద్దీ నెలకొనేది. దీన్ని నివారించేందుకు వినియోగదారులు ఇంటి వద్ద నుంచే యాప్‌ల ద్వారా ఈకేవైసీ చేసుకునే అవకాశం కల్పించాయి.

యాప్‌లో పూర్తయ్యాక.. యాప్‌లో రిజిస్టర్ అయ్యాక ఈకేవైసీ ఆప్షన్‌లోకి వెళ్లాలి. ముఖ గుర్తింపు ద్వారా వివరాలు నమోదు చేయాల్సి ఉంది. ఇంటి వద్ద యాప్‌ల ద్వారా చేసుకోలేని వారు గ్యాస్ ఏజెన్సీల వద్దకెళ్లాలి. అక్కడ విధిగా రిజిస్టర్ ఫోన్ నంబరు, ఆధార్, గ్యాస్ పుస్తకం నకలు సమర్పించాలి. వినియోగదారులంతా గడువులోపు ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి విలియమ్స్ సూచించారు.

జిల్లా వివరాలిలా..

గ్యాస్ కనెక్షన్లు:	6,18,718
ఈకేవైసీ పూర్తి:	5,13,182
పూర్తి కానివి:	1,05,522



చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

విమల ఆశయాలు సాధిద్దాం: సీపీఎం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: సమాజ శ్రేయస్సు, నమ్మిన సిద్ధాంతాల సాధనకు గారపాటి విమల చివరి వరకు పోరాడారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్. లింగరాజు అన్నారు. ఎన్ఆర్ పేటలో విమల ప్రథమ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. లింగరాజు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని గుర్తుచేశారు. మహిళా సమానత్వం, వివక్ష, అణచివేత, దాడులు, వేధింపులకు వ్యతిరేకంగా ఆందోళనలు, పోరాటాలు చేశారన్నారు. ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు సీతారాం, ప్రసాద్, నరసింహారావు, వెంకట కృష్ణారావు, సురేశ్, విజయ, అజయ కుమారి, శిరీష, రవి, బాబూరావు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్



నినాదాలు చేస్తున్న సంఘ నాయకులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక జన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య డిమాండ్ చేశారు. స్థానిక సంఘ భవనంలో ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. కట్లయ్య మాట్లాడుతూ.. దేశంలోని 18 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీ జాబితాలో, 11 రాష్ట్రాల్లో బీసీ జాబితాలో ఉన్నారన్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్నారు. గ్రామాల్లో రజకులపై దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని సంఘ జిల్లా సంయుక్త కార్యదర్శి కె.మురళి విజ్ఞప్తి చేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామని 2014లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారని, నేటికీ మాట నిలబెట్టుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు శ్రీనివాసు, శాంతికుమార్, సుబ్బయ్య, నాగేషు ఉన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక ఈదర సుబ్బమ్మదేవి నగర పాలకోన్నత పాఠశాలలో ఏలూరు లయన్స్, సెంట్రల్, స్మార్ట్ సిటీ, మెర్సిన్ జోన్స్ క్లబ్‌ల ఆధ్వర్యాన సుశ్రిత ఫౌండేషన్, ఏషియన్ వాస్క్యులర్ ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత వేరికోస్ వీన్స్ వైద్య శిబిరం నిర్వహించారు. 252 మంది బాధితులకు వైద్య సిబ్బంది కలర్ డోప్లర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని ఆసుపత్రికి తీసుకెళ్తారని సమన్వయకర్త వి. రత్నకుమార్ తెలిపారు.

రాట్నాలమ్మకు అభిషేకం



రాట్నాలకుంట(పెదవేగి): రాట్నాలకుంట రాట్నాలమ్మ ఆలయం ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చన చేసి పసుపు కొమ్ములతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పూజా ద్రవ్యాలు, ప్రసాదాల విక్రయాలతో రూ.1,10,200 ఆదాయం సమకూరిందని ఛైర్మన్ మన్నే శ్రీనివాసరావు, ఈవో సతీశ్ కుమార్ తెలిపారు.

వైభవంగా కోట్లమ్మ సంబరం



చేబ్రోలు(ఉంగుటూరు): చేబ్రోలు గ్రామ దేవత కోట్లమ్మ శ్రావణ మాస సంబరాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామస్థులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి సలివిడి పానకాలు పోశారు. తీన్‌మార్ డప్పులు, బాణసంచా పేలుళ్ల నడుమ గరగలతో అమ్మవారిని ఊరేగించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు కర్ణం బుజ్జి, పిట్టా శివయ్య, బొమ్మిడి అప్పారావు, యెలిశెట్టి పాపారావు, బాబ్జి పర్యవేక్షించారు.

ఏలూరు సినిమాలు

అంబికా డీలక్స్	హాయ్
అంబికా మిని	అగధ
అంబికా లిటిల్	పాంచాలి పంచభర్తృక
సాయి బాలాజీ	కొరియన్ కనకరాజు
బాలాజీ	ది రెడ్ బ్యాగ్
సత్యనారాయణ 1	విశ్వనాథన్ అండ్ సన్స్
సత్యనారాయణ 2	ఇరుముడి
సత్యనారాయణ 3	అమీర్‌లోగ్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	మకుటం
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	డీసీ
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	టాక్సిక్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్1	ఇరుముడి
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్2	టాక్సిక్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్3	కొరియన్ కనకరాజు

ధరల పెరుగుదలతో కుదేలు



మాట్లాడుతున్న కిశోర్

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: నిత్యావసర సరకుల ధరల పెరుగుదలతో పేదలు కుదేలవుతున్నారని ఆర్ సీపీఐ జిల్లా కార్యదర్శి పి.కిశోర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం బహిరంగ విపణిలో ధరలు ఆకాశాన్నంటుతున్నాయని చెప్పారు. పేద, సామాన్య ప్రజలు ఏదీ కొనలేని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలపై చూపుతున్న శ్రద్ధ.. మార్కెట్లో ధరల పెరుగుదలను నియంత్రించడంలో చూపడం లేదని మండిపడ్డారు. నాయకులు జి.శారద, శ్రీనివాసరావు, ఎం.గణేష్, ఎల్.భవాని తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతిపై కేసు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: స్థానిక అశోక్ నగర్ కూడలి వద్ద రోడ్డు పక్కన బల్లపై ఆదివారం సాయంత్రం పడుకొని 60-65 ఏళ్ల వయసున్న వృద్ధుడు వ్యక్తి మృతి చెందారు. సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అదుపు తప్పి చెత్త తరలింపు ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ట్రాక్టరులో చెత్త నింపుకొని పోణంగి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. మార్గం మధ్యలోని చిరంజీవి బస్‌స్టాప్ దాటాక అదుపు తప్పి పక్కనున్న పైపుల పైకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో వాహన చోదకుడికి పక్కనే కూర్చొన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. చెత్తంతా రోడ్డుపై చెల్లాచెదురుగా పడింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని గ్రామీణ పోలీసులు తెలిపారు.



భక్తిశ్రద్ధలతో నామజప యజ్ఞం

ఏలూరు, ఈనాడు: ఏలూరులోని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం 108 కోట్ల నామజప యజ్ఞం నిర్వహిస్తున్నారు. భక్తులు జపమాలను ధరించి రోజుకు 108 సార్లు హరేకృష్ణ మహా మంత్రాన్ని జపిస్తున్నారు. ఈ యజ్ఞంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎందరో భక్తులు పాల్గొంటున్నారని అధ్యక్షుడు రాధావల్లభదాస్ తెలిపారు. కలియుగంలో కేవలం భగవంతుడి స్మరణతోనే సకల సౌభాగ్యాలు కలుగుతాయని ఆయన పేర్కొన్నారు.

చింతలపూడి
• చింతలపూడి • పోలవరం



ఆలయ నిర్మాణం పూర్తి

టి.నరసాపురం, న్యూస్‌టుడే: టి.నరసాపురంలో వేణుగోపాల స్వామి వారి (గీతా మందిరం)ఆలయం పునః నిర్మాణం పూర్తయ్యింది. 1979లో స్థానికులు నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో ఇటీవల దాతలు సుమారు రూ.16లక్షలతో పునఃనిర్మించారు. సెప్టెంబరు 7న ఆలయంలో రాధావేణుగోపాల స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అభయాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : జంగారెడ్డిగూడెం మండలం వేగవరంలో అభయాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన పూజల్లో పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.

? ✔ **చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే:**

సమస్య: చింతలపూడి పట్టణం శివాలయం వీధిలో డ్రెయిన్లపై మూతలు లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. **-సయ్యద్ అలీ, శివాలయం వీధి**

సమాధానం: అవసరమైన ప్రాంతాల్లో డ్రెయిన్లపై మూతలు వేసి సమస్య పరిష్కరిస్తాం.

-రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: జీలుగుమిల్లి ప్రధాన రహదారి పక్కనున్న గ్రామదేవత ముత్యాలమ్మకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కాలనీలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. అనంతరం పలు వీధుల్లో ఊరేగింపు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

భవనాలు శిథిలం.. నిత్యావసరాల పంపిణీకి కష్టం!

జీసీసీ డిపోల దుస్థితి



వింజరంలో శిథిల భవనం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

బుట్టాయగూడెం, పోలవరం, వేలేరుపాడు, న్యూస్‌టుడే: మన్యం మండలాల్లోని పలు గ్రామాల్లో ఉన్న గిరిజన సహకార సంస్థ (జీసీసీ) డిపోల భవనాలు శిథిలస్థితికి చేరి ఎప్పుడు కూలుతాయోనన్న భయాందోళన కలిగిస్తున్నాయి. దీంతో నిత్యావసరాలు నిల్వ చేసేందుకు, పంపిణీకి నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. వీటి దుస్థితిని గురించి పట్టించుకున్న నాథులు కొరవడ్డారు.

శాఖ	డిపోల సంఖ్య
కేఆర్‌పురం	26
కుక్కునూరు	10

బుట్టాయగూడెం: మండలంలోని పులిరామువుడుగూడెం, దొరమామిడి, పందిరిమామిడిగూడెం, అంతర్వేదిగూడెం తదితర గ్రామాల్లో గతంలో నిర్మించిన భవనాలు శిథిలస్థితిలో ఉన్నాయి. కనీసం ఇవి మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. 'మరమ్మతుల కోసం గతంలో ప్రతిపాదనలు పంపాం. మంజూరు కావాల్సి ఉంది' అని కేఆర్‌పురం శాఖ మేనేజర్ గౌరమ్మ తెలిపారు.

చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి

పోలవరం: వింజరంలో శిథిలస్థితిలో ఉన్న జీసీసీ డిపో భవనం చుట్టూ పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోయాయి. దీంతో గ్రామంలోని మత్స్యశాఖకు చెందిన భవనంలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నారు. జిల్లెళ్లగూడెంలో డిపో భవనం శిథిలస్థితికి చేరడంతో అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. గుంజవరంలో రెండు దశాబ్దాల కిందట నిర్మించిన భవనం బీటలు వారుతోంది. గెడ్డపల్లిలో డిపోకు పూర్వం నుంచి భవనం లేకుండానే కాలక్షేపం చేస్తున్నారు. కమ్యూనిటీ భవనంలో నిర్వహిస్తున్నారు.

ఏటా వరద నీటిలో మునుగుతూ..

వేలేరుపాడు: మండలంలోని కొయిదా, కట్కూరు, వేలేరుపాడు, కాకిసనూరు, చిగురుమామిడి గ్రామాల్లోని డిపోలకు నలభై ఏళ్ల కిందట నిర్మించిన రేకులషెడ్లు ఏటా గోదావరి వరదలకు నీట మునుగుతున్నాయి. గోడలు బీటలు వారడంతో పాటు తలుపులు, కిటికీలు ఊడిపోయాయి. దీంతో ప్రతి నెలా నిత్యావసరాల నిల్వ, సరాఫరా చేసేందుకు వీలులేకుండా ఉన్నాయి. చేసేది లేక ఎప్పటికప్పుడు కుక్కునూరులోని జీసీసీ గిడ్డంగి నుంచి వాహనాల ద్వారా సరకులను సరఫరా చేస్తున్నారు.



వేలేరుపాడులో భవనం ఇలా..

అంచుల్లో తుప్పలు.. మలుపుల్లో ముప్పు



జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : పట్టణంలోని వైఎస్సార్ కాలనీ రహదారి పూర్తిగా తుప్పలతో నిండిపోయింది. అగ్నిమాపక కేంద్రం నుంచి వైఎస్సార్ కాలనీ వరకు తారు రోడ్డు ఉంది. దీనికి ఇరువైపులా అంచుల్లో తుప్పలు, పిచ్చి మొక్కలు పెరిగాయి. వీటి వల్ల మలుపులు ఉన్న చోట రోడ్డు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. తుప్పలను తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



పెద్దింట్లమ్మ స్మరణతో పులకించిన భక్తులు

కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేటికోట పెద్దింట్లమ్మ అమ్మవారి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి కుటుంబ సమేతంగా భక్తులు రావడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా అమ్మవారి నామస్మరణతో ఈ ప్రాంతమంతా మార్మోగగా పద్మాసన భంగిమలోని అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని చూసిన భక్త జనం పులకించారు. ధ్వజస్తంభం వద్ద పూజలు చేసి.. చలువ పందిళ్లలో వండిన పాల పొంగళ్ల నైవేద్యాన్ని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు, పసిపిల్లలకు పాలు, తాగునీరు, మజ్జిగ అందించి దేవస్థాన ఛైర్మన్ జల్లూరి వెంకన్నబాబు, ఈవో కె.శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అభివృద్ధికి సహకరించండి: ఎమ్మెల్యే



వ్యాపారవేత్తలతో మాట్లాడుతున్న రోషన్ కుమార్

చింతలపూడి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు పెట్టుబడిదారులు ముందుకు రావాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. పలువురు ప్రముఖ వ్యాపారవేత్తలతో స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చింతలపూడిలో గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారితో పాటు మరో జాతీయ రహదారి అందుబాటులోకి రాబోతుందన్నారు. ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెడితే అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

అన్ని రంగాల్లో ముందుకు సాగాలి: చిర్రి



నగదు అందిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: యువత చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. ఈ మేరకు బర్రింకలపాడులోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు అర్హత సాధించిన వేలేరుపాడు మండలం మల్లారం గ్రామానికి చెందిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యంలోని యువకులు జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. వారికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు మేదినేని సంజయ్, క్రీడాకారులు మనోజ్‌కుమార్, ఉదయ్‌కిరణ్, అభిరామ్, వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రెయిన్



జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పట్టణంలోని రెండో వార్డు సుబ్రహ్మణ్య స్వామి గుడి ముందు వీధిలో డ్రెయిన్ అధ్వానంగా ఉంది. అక్కడ సీసీ రోడ్డు ఉన్నప్పటికీ డ్రెయిన్ నిర్మాణం జరగలేదు. కచ్చా డ్రెయిన్‌ను శుభ్రం చేయకపోవడం, పూడిక తీయక పోవడంతో మురుగు కదలడం లేదు. దీనికి తోడు మురుగు వెళ్లేందుకు ప్రధాన డ్రెయిన్‌కు అనుసంధానం కాలేదు. దీంతో దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. డ్రెయిన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామని కమిషనర్ కె.వి.రమణ పేర్కొన్నారు. ముందుగా డ్రెయిన్ శుభ్రం చేయిస్తామన్నారు.

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి, సంక్షేమం



రాజుపోతేపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న తెదేపా నాయకులు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెదేపా మండల ఉపాధ్యక్షుడు దావులూరి సూర్యనారాయణ అన్నారు. రాజుపోతేపల్లిలో ఆదివారం 'కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాల'పై పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ పోలవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చిలకా బాలయ్య, నాయకులు మూసునూరి బాలస్వామి, గుండు శివ శంకర్, శ్రీనివాసరావు, నాగరాజు పాల్గొన్నారు.

నియంత్రిక చుట్టూ అల్లుకున్న తీగలు



చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి మండలం రేచర్ల ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. దాని చుట్టూ చెట్ల పొదలు అల్లుకుని ఉండటంతో విద్యుత్తు సరఫరా అవుతోందని స్థానికులు తెలిపారు. పాఠశాల పక్కనే ఉండటంతో వర్షం కురిసినప్పుడు ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. చెట్లపొదులను తొలగించి సమస్య పరిష్కరిస్తామని విద్యుత్తు ఏడీఈ రాంబాబు తెలిపారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం గుడిపాడులో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామివారికి విఘ్నేశ్వర పూజ, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. భక్తులకు అన్నదానం చేశారు.

కూటమి భాగస్వామ్యంతో ఎన్నికల్లో పాల్గొంటాం



విలేకరులతో మాట్లాడుతున్న భాజపా నాయకులు

కామవరపుకోట, న్యూస్‌టుడే: రానున్న ఎన్నికల్లో కూటమి భాగస్వామ్యంతో కలిసి పని చేస్తామని భాజపా జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ తెలిపారు. ఆదివారం మండలంలో జీలకర్రగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పని చేస్తోందన్నారు. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించటంలో పారదర్శకంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఎస్.ఆర్.ఆర్.లక్ష్మీసూర్యనారాయణరాజు, నల్లమోతుల లక్ష్మయ్య, శ్యామ్‌శేఖర్, మురళీసుబ్బరాజు పాల్గొన్నారు.

కొల్లేరు ప్రాంత ప్రజల ఉన్నతికి కృషి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: కొల్లేరు ప్రాంత ప్రజల ఉన్నతికి, బీసీల అభ్యున్నతికి జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని ఏపీ వడ్డీల సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. యువత రాజకీయాల్లో రావాలని, స్థానిక ఎన్నికల్లో వారికి ప్రాధాన్యమిస్తానని పవన్ కల్యాణ్ వెల్లడించారన్నారు. దెందులూరు నియోజకవర్గంలో 2019 నుంచి ఇప్పటి వరకు పార్టీ బలోపేతానికి శ్రమించిన జన సైనికుల వివరాలను కేంద్ర కార్యాలయానికి పంపామని చెప్పారు. పార్టీలో ఎటువంటి విభేదాలు లేవని, అందరూ కలిసికట్టుగా జనసేనను పటిష్ఠం చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో మూడ్రోజులపాటు అధినేత జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో 8 ఆవాసాల్లో నీటి సమస్య

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్

ముఖాముఖి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఎల్‌నినో ప్రభావం తీవ్రమైతే జంగారెడ్డిగూడెం ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ పరిధిలోని 8 ఆవాసాల్లో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని డీఈ పి.శ్రీనివాస్ పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెంలో ఆదివారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఈ ఆవాసాలకు నీటిని సరఫరా చేసేందుకు అందుబాటులో ఉన్న వనరులు, రవాణా మార్గాలపై నివేదిక రూపొందించినట్లు చెప్పారు. సమీపంలోని పంటచేలల్లో రైతుల వ్యవసాయ బోర్ల నుంచి నీరు సరఫరా చేస్తామన్నారు. ప్రస్తుతం నీటి సమస్య ఏమీ లేదని చెప్పారు.

భూగర్భ జలాలు తగ్గిన చోట్ల..

భూగర్భ జలాలు తగ్గడం వల్ల బోర్ల నుంచి నీటి తోడకం తగ్గుతోందన్నారు. ఈ సమస్యను అధిగమించడం కోసం బోర్లకు పైప్ అమర్చి మోటార్లను కిందకు దించుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే లింగపాలెం మండలం ముడిచెర్లలో నీటి సమస్య తలెత్తకుండా మోటారును కిందకు దించినట్లు చెప్పారు. ● పీఎంఏజీవైలో 200 పనులకు రూ.7.75 కోట్లు మంజూరు కాగా.. ఇప్పటికి 130 పూర్తయ్యాయని, 8 పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇంకా 62 పనులను ప్రారంభించాల్సి ఉందన్నారు. వీటిలో అధిక భాగం డ్రెయిన్‌లు ఉన్నాయని చెప్పారు.

● ఎస్‌డీపీ పథకంలో 7 బోరువెల్స్‌కు రూ.20.50 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 8 మరుగుదొడ్లకు రూ.2.88 లక్షలు, రన్నింగ్ వాటర్ ఏర్పాటుకు రూ.10.56 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. వాటిలో 300 నుంచి 500 లీటర్ల నీటి ట్యాంక్ అమర్చి పైప్‌లైన్ వేసి హాఫ్ హెచ్‌పీ మోటారు అమరుస్తామని వివరించారు.

అధ్వానంగా అంతర్గత రహదారులు



దేవుడిమాన్యం కాలనీలో రోడ్డు దుస్థితి

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: నగర పంచాయతీగా మారిన తర్వాత చింతలపూడి పట్టణ రూపురేఖలు మారతాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. నగర పంచాయతీకి తగినట్లుగా పన్నులు వసూళ్లు చేస్తున్నారు కాని అంతర్గత రహదారులు, తాగునీరు, డ్రెయినేజీ, పారిశుద్ధ్య పనులు మెరుగుపడటం లేదు. పదేళ్లుగా ప్రధాన రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎట్టకేలకు ప్రధాన రహదారికి మరమ్మతులు చేశారు. కానీ పట్టణంలో ఉన్న ఇరవై వార్డుల్లో చాలావరకు అంతర్గత రహదారులు నిర్మించక పోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

బురదతో అవస్థలు

సుప్రియన్‌పేట, దేవుడిమాన్యం కాలనీ, భట్టువారిగూడెం, వైఎస్సార్ కాలనీ, మారుతీనగర్‌లో అంతర్గత రహదారుల పరిస్థితి దారుణంగా ఉంది. చాలావరకు మట్టిరోడ్లు కావడంతో కొద్దిపాటి వర్షం కురిసినా మొత్తం చిత్తడిగా మారుతున్నాయి. దీంతో బురదలోనే రాకపోకలు సాగిస్తున్నామని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు.

డ్రెయిన్లు సక్రమంగా లేక..

డ్రెయిన్లు సక్రమంగా లేకపోవడంతో వర్షపునీటితో పాటు మురుగునీరు రహదారులపైకి చేరుతోంది. చిత్తడిగా మారిన మార్గంలోనే చిన్నారులు పాఠశాలలకు వెళ్లాల్సివస్తోంది. ప్రధాన రహదారి వెంబడి అమృత్ 2.0 పనుల పేరుతో గుంతలు తవ్వి మట్టిని వదిలేస్తున్నారు. వర్షానికి ఆ మట్టి బురదగా మారి రహదారిపైకి వస్తుండటంతో ప్రయాణానికి అసౌకర్యంగా ఉంటుందని చోదకులు చెబుతున్నారు. పట్టణంలోని కాలనీల్లో అంతర్గత రహదారులను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే అన్ని కాలనీల్లో అంతర్గత రహదారులు నిర్మించడంతో పాటు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేస్తాం. పారిశుద్ధ్యం మెరుగుపరచి పట్టణాన్ని శుభ్రంగా ఉంచుతాం. త్వరలోనే సమస్యలన్నీ పరిష్కరిస్తాం.

-రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక జన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య డిమాండ్ చేశారు. స్థానిక సంఘ భవనంలో ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. కట్లయ్య మాట్లాడుతూ.. దేశంలోని 18 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీ జాబితాలో, 11 రాష్ట్రాల్లో బీసీ జాబితాలో ఉన్నారన్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్నారు. గ్రామాల్లో రజకులపై దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని సంఘ జిల్లా సంయుక్త కార్యదర్శి కె.మురళి విజ్ఞప్తి చేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామని 2014లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారని, నేటికీ మాట నిలబెట్టుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.


మరీ ఇంత నిర్లక్ష్యమా?



తలుపులు మూసి ఉన్న వెలగలపల్లి పోలింగ్ బూత్

చింతలపూడి, న్యూస్‌టుడే: మండలంలోని ప్రతి పోలింగ్ బూత్‌లో బీఎల్వోలు ఆదివారం అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఆదేశించినా మండలంలోని పోలింగ్ బూత్‌లలో ఎవరూ సక్రమంగా హాజరుకాలేదు. బీఎల్వోలు ఓటర్ల నుంచి చేర్పులు, మార్పులకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించడం, 18 ఏళ్లు నిండిన యువత నుంచి ఓటు హక్కు కోసం దరఖాస్తులు తీసుకోవడం, ఓటర్ల అనుమానాలను నివృత్తి చేయడం వంటి పనులు చేయాల్సి ఉంది. కానీ చాలా బూత్‌లలో కనీసం గేట్లు కూడా తీయలేదు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో వెలగలపల్లి, చింతలపూడి జూనియర్ కళాశాలలో పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తే రెండు కేంద్రాలకు బీఎల్వోలు హాజరుకాలేదు. కొన్ని కేంద్రాల్లో మాత్రం ఉదయాన్నే ఫొటో దిగి ఇంటికి వెళ్లిపోయారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కార్యక్రమానికి సైతం హాజరుకాకుండా నిర్లక్ష్యం వహించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కంఠమనేని సేవలు స్ఫూర్తిదాయకం



విగ్రహం ఆవిష్కరిస్తున్న నాయకులు

కామవరపుకోట, న్యూస్‌టుడే: కంఠమనేని సేవలు స్ఫూర్తిదాయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కామవరపుకోట మండలం కంఠమనేనివారిగూడెంలో ఆదివారం తెదేపా సీనియర్ నాయకుడు, దివంగత కంఠమనేని సత్యనారాయణ విగ్రహావిష్కరణ, సంస్మరణ సభ నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆత్మీయుడిని కోల్పోయామన్నారు. ఎంపీ పుట్టా మహేశ్, జిల్లా తెదేపా అధ్యక్షుడు బడేటి చంటి, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌లు మాట్లాడుతూ రైతు బాంధవుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే గంటా మురళీరామకృష్ణ, కూటమి నాయకులు, రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా శ్రేణులు పని చేయాలని తెదేపా జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపునిచ్చారు. సీతారాంపురంలోని ఎంపీ విడిది కార్యాలయంలో ఆదివారం ఎంపీ మహేశ్ కుమార్, గన్ని వీరాంజనేయులు, కైకలూరు, చింతలపూడి ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, రోషన్ కుమార్‌లతో బడేటి సమావేశమయ్యారు.

పోలవరం, పట్టిసీమలో తాగునీటి ఇక్కట్లు



బంగారమ్మపేటలో పనిచేయని మైక్రో ఫిల్టర్

పోలవరం, న్యూస్‌టుడే: సత్యసాయి మంచినీటి పథకం ద్వారా సరఫరా చేసే తాగునీరు రెండు రోజులుగా సక్రమంగా రాకపోవడంతో పోలవరం, పట్టిసీమ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పట్టిసీమ కూడలి నుంచి గోదావరి నీటిని తరలించి శుద్ధి చేసేందుకు బంగారమ్మపేట వద్ద నిర్మించిన ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలిస్తారు. అక్కడ నుంచి మైక్రో ఫిల్టర్‌లు, సంప్‌లోకి వెళ్లిన నీటిని మోటార్ల ద్వారా ఇటు పోలవరం, అటు పట్టిసీమ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో నిర్మించిన మినీ ట్యాంకులకు పంపిస్తారు. వరదల కారణంగా నీటితో పాటు బురద రావడంతో ఫిల్టర్‌లు దెబ్బతిన్నాయి. ఈ విషయం అక్కడ కార్మికులు గుర్తించి గుత్తేదారుడికి, అధికారులకు తెలియజేశారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఫిల్టర్‌ల నుంచి నీరు అంతగా రావడం లేదు. దాంతో ట్యాంకులకు నీటిని తరలించడం ఇబ్బందికరంగా మారింది. ఆదివారం ఉదయం నుంచి పూర్తి స్థాయిలో పథకం ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగరాజును సంప్రదించగా మైక్రో ఫిల్టర్‌లు పాడైన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే కొత్త ఫిల్టర్‌లు తీసుకు వచ్చి వేయాలని గుత్తేదారుకు సూచించామని చెప్పారు. కానీ బిల్లులు పెండింగ్ అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు



చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి పట్టణంలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా మారాయి. బోయగూడెం, వెలమపేట, కొవ్వూరిగూడెం, ఆర్కేనగర్‌లో చాలా చోట్ల తీగలు కిందకు ఉండటంతో నిత్యం భయపడుతున్నామని స్థానికులు తెలిపారు. శివాలయం మొదటివీధిలోకి ఇదే కారణంతో లోపలికి పెద్ద వాహనాలు రావడం లేదని, తీగలు పైకిఅమర్చాలని అధికారులు కోరినా పట్టించుకోవడంలేదని చెప్పారు. ప్రమాదం జరగకముందే కిందకు ఉన్న తీగలను పైకి అమర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు. 'పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో తీగలను సరి చేసి సమస్య పరిష్కరిస్తాం' అని విద్యుత్తు ఏడీఈ రాంబాబు తెలిపారు.

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ముసునూరు, న్యూస్‌టుడే: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు సమగ్ర అభివృద్ధిని వేగవంతం చేసిన ఘటన కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెదేపా గ్రామ అధ్యక్షుడు, సొసైటీ ఛైర్మన్ ఉప్పలపాటి గణేశ్ అన్నారు. ఆదివారం ముసునూరు మండలం గోపవరంలో తెదేపా ఇంటింటికీ కార్యక్రమం నిర్వహించారు. రోడ్లు, తాగునీటి, డ్రెయినేజీ, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్యలను మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

పెద్దింట్లమ్మ స్మరణతో పులకించిన భక్తులు



కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేటికోట పెద్దింట్లమ్మ అమ్మవారి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి కుటుంబ సమేతంగా భక్తులు రావడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా అమ్మవారి నామస్మరణతో ఈ ప్రాంతమంతా మార్మోగగా పద్మాసన భంగిమలోని అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని చూసిన భక్త జనం పులకించారు. ధ్వజస్తంభం వద్ద పూజలు చేసి.. చలువ పందిళ్లలో వండిన పాల పొంగళ్ల నైవేద్యాన్ని భక్తి శ్రద్ధలతో అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు, పసి పిల్లలకు పాలు, తాగునీరు, మజ్జిగ అందించి దేవస్థాన ఛైర్మన్ జల్లూరి వెంకన్నబాబు, ఈవో కె.శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు	:80085 74698	ఆగిరిపల్లి	:92940 00369
ముసునూరు	:93983 81268	చాట్రాయి	:80085 74700
కైకలూరు	:73060 88555	మండవల్లి	:81060 99008
కలిదిండి	:90594 84862	ముదినేపల్లి	:80085 74693

కలిదిండి, న్యూస్‌టుడే : ? సొనారుద్రవరం పంచాయతీ పరిధిలోని మరియు రుద్రవరంలోని ప్రధాన మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో రాకపోకలకు భయంగా ఉంటోంది. **- రాజు, సొనారుద్రవరం**

✔ ఇటీవలే దీపాలకు మరమ్మతులు చేయించాం. మరోసారి పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- రాఘవేంద్రరావు, పంచాయతీ కార్యదర్శి**

కైకలూరు, న్యూస్‌టుడే: ? కైకలూరు 4వ వార్డులో కొన్నిరోజులుగా పంచాయతీ వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రి సమయంలో సైకిల్‌పై ప్రయాణించేవారు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. **- భార్గవి, కైకలూరు**

✔ వెలగని వాటిస్థానంలో కొత్త దీపాలు ఏర్పాటు చేస్తాం. **- ఫణిరాజకుమారి, పంచాయతీ, ఈవో కైకలూరు**

యాప్‌తో ఆపసోపాలు

ఎరువుల కొనుగోలుకు అన్నదాతల ఇక్కట్లు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎరువుల బుకింగ్ యాప్‌లో నెలకొంటున్న సమస్యలతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రప్రభుత్వం ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా యూరియాతో పాటు, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ తదితరాల బుకింగ్‌ను చేపట్టారు. చాలా మంది రైతులకు నెట్‌వర్క్ సమస్య ఏర్పడుతోంది. దీంతో ఎరువులు కొనుగోలు చేసుకోలేకపోతున్నారు.

ఇవీ సమస్యలు..

➤ నూజివీడు నియోజకవర్గంలో 34,500 మంది రైతులు ఉన్నారు. ఇప్పటికే ఫార్మ్ రిజిస్ట్రేషన్ పూర్తి అయిన రైతులు 32,600 మంది ఉన్నారు. మిగిలిన వారి నమోదుకు వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

➤ వేలాది మంది రైతులకు స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం, ఫోన్లు ఉన్నా యాప్ డౌన్‌లోడ్ కాకపోవడం, డౌన్‌లోడ్ చేసినా యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ కాకపోవడం ప్రధాన సమస్యగా మారింది. మరో వైపు తమ మండలంలోని ఎరువుల దుకాణాలన్నీ యాప్‌లో కన్పించడం లేదు. కేవలం సొసైటీల్లోనే ఎరువులను బుక్ చేయాల్సిన పరిస్థితి.

➤ దాదాపు 70 శాతం గ్రామాల్లో రైతులకు చెందిన మొత్తం సర్వే నంబర్లు, పూర్తి విస్తీర్ణం భూమి యాప్‌లో కనిపించడం లేదు. దీంతో రైతులు తమకున్న భూ విస్తీర్ణం కన్నా తక్కువ మోతాదులో ఎరువులను బుక్ చేసుకోవాల్సి వస్తోంది.

➤ కొన్ని చోట్ల యాప్ ద్వారా ఎరువులు దుకాణాలకు వెళితే గడ్డలు కట్టిన ఎరువులను అంటగడుతున్నారు. ఎరువులతో ఇతర పోషకాలు లింక్ పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. నాణ్యమైన ఎరువులు సరఫరా చేసేలా, పోషకాల లింకులు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

➤ యజమానులు ఇతర ప్రాంతాల్లో ఉన్నప్పుడు కౌలు రైతులు ఎరువులు తీసుకోవడం కష్టంగా ఉంది. వీరికి గుర్తింపు కార్డులు ఇచ్చి ఎరువులను సరఫరా చేయాలి.

➤ చాలాచోట్ల అధిక ధర రైతులను వేధిస్తోంది. రవాణా ఛార్జీలు అదనపు భారంగా మారాయి. పురుగు మందులు, ఇతర ఉత్పత్తులను తమ వద్దే కొనుగోలు చేయాలని, లేదంటే బుకింగ్ క్యాన్సిల్ చేస్తామని చెబుతుండటంతో రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో యూరియా

మార్క్‌ఫెడ్‌లో 2 వేల టన్నులు యూరియా ఉంది. అన్ని సొసైటీల్లో ఐదు టన్నులు ఉండగానే స్టాక్ పెట్టాలని ఆదేశాలిచ్చాం. 500 టన్నుల యూరియాను రైతులు వినియోగించారు. కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయి. **- పి.చెన్నారావు, ఏవో, నూజివీడు.**

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం గుడిపాడులో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామివారికి విఘ్నేశ్వర పూజ, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. భక్తులకు అన్నదానం చేశారు.

ఉపాధ్యాయులు బాధ్యతతో పని చేయాలి

చాట్రాయి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు బాధ్యతతో పని చేస్తే ప్రజల మన్నన పొందుతారని డీపీఆర్టీయూ రాష్ట్ర నాయకులు ఆర్.నాగేశ్వరరావు తెలిపారు. చాట్రాయిలో ఆదివారం సంఘం ఆధ్వర్యంలో తెలుగు, వ్యాయామ ఉపాధ్యాయులు బి.సక్రూ, కొండా చిట్టిబాబు, జి.రామాంజనేయులు, గిరిబాబులను సన్మానించారు. సంఘ నాయకులు సత్తెనపల్లి రాము, బీసీహెచ్ రాంబాబు, తేరా రామారావు, పి.తిరపతయ్య, చంద్రకళ, ఎస్.రంగారావు తదితరులు పాల్గొన్నారు.



కలిదిండిలో కర పత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు

కూటమి పాలనలో పల్లె దారులకు మోక్షం

కలిదిండి, న్యూస్‌టుడే : వైకాపా ఏలుబడిలో ధ్వంసమైన పల్లె రహదారులకు కూటమి పాలనలో మోక్షం లభించిందని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు తెలిపారు. కలిదిండిలోని 253వ బూత్ పరిధిలో ఆదివారం 'నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం' కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. తెదేపా గ్రామ అధ్యక్షుడు అబ్దుల్ అస్లామ్, కూటమి నేతలు యలవర్తి జయరావు, పులి వెంకటేశ్వరరావు, ఖాన్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులను తీర్చిదిద్దడంలో గైడ్ కెప్టెన్ల పాత్ర కీలకం

ముసునూరు, న్యూస్‌టుడే: విద్యార్థినులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడంలో గైడ్ కెప్టెన్ల పాత్ర కీలకమని రాష్ట్ర ట్రైనింగ్ కమిషనర్ ఉమాదేవి తెలిపారు. ఏపీ గురుకుల పాఠశాలకు చెందిన 24 మంది ఉపాధ్యాయినులకు ఆదివారం ముసునూరు బాలికల గురుకుల పాఠశాలలో ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో గైడ్ కెప్టెన్లుగా ఎంపిక చేశారు. వీరికి సెప్టెంబరు 1వ తేదీ నుంచి శిక్షణ మొదలవుతుందన్నారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ.. గైడింగ్ ప్రాథమిక సూత్రాలు, నాయకత్వ లక్షణాలు, ప్రాక్టికల్ నైపుణ్యాలు, క్యాంపింగ్, అడ్వెంచర్, సామాజిక బాధ్యత వంటి అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ట్రైనర్లు మహదేవమ్మ, శకుంతల, వాణి, సౌజన్య పాల్గొని శిక్షణ అందిస్తారన్నారు.

మంత్రి ఆదేశాలతో తాగునీటి సమస్యకు పరిష్కారం

● యుద్ధప్రాతిపదికన విద్యుత్తు లైను ఏర్పాటు ● స్థానికుల హర్షం



కొత్త మోటారు వద్ద నాయకులు వేణు, నరసయ్య, ఏడీఈ బాలాజీ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లిలో తాగునీటి సమస్యకు మంత్రి కొలుసు పార్థసారథి చర్యలతో పరిష్కారం లభించింది. కొండకాలనీ, పశువుల ఆసుపత్రి, యాదవ బజారు, సగర్ల బజారు, తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలకు గత ఎనిమిది నెలలుగా తాగునీరు సరిగా సరఫరా జరగక అవస్థలు పడుతున్నారు. దాంతో శనివారం సాయంత్రం నూజివీడు - విజయవాడ ప్రధాన రహదారిలో ఆగిరిపల్లి స్టేట్ బ్యాంకు కూడలి దగ్గర మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా చేసిన సంగతి తెలిసిందే. దాంతో విషయం తెలుసుకున్న మంత్రి పార్థసారథి ఆగిరిపల్లిలో తాగునీటి సమస్యపై ఆరా తీసి వివరాలు తెలుసుకున్నారు. తాగునీటి సమస్యను తక్షణం పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తెదేపా మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, గ్రామ అధ్యక్షుడు పామర్తి నరసయ్య పర్యవేక్షణలో.. విద్యుత్తు ఏడీఈ జె.బాలాజీ, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, సిబ్బందితో ఆదివారం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. కొత్త విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేసి త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా అందేలా చర్యలు తీసుకున్నారు. కొత్త మోటారును ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాను ప్రారంభించారు. 24 గంటల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి పార్థసారథికి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

★ ఆగిరిపల్లిలో సమస్యల పరిష్కారానికి మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాలతో ప్రత్యేక కార్యచరణ చేపట్టినట్లు తెదేపా మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, గ్రామ అధ్యక్షుడు పామర్తి నరసయ్య తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని, మురుగు కాలువల నిర్వహణ సరిగా లేక ప్రజలు అవస్థలు పడుతున్న విషయం మంత్రి దృష్టికి వెళ్లిందని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పారిశుద్ధ్యాన్ని మెరుగు పరుస్తున్నట్లు వివరించారు.

మండలస్థాయి చెడుగుడు పోటీలు ప్రారంభం

ముసునూరు, న్యూస్‌టుడే: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ముసునూరులో మండల స్థాయి సీనియర్, జూనియర్ విభాగాల్లో చెడుగుడు పోటీలు ఆదివారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను వచ్చే నెల 6వ తేదీ వరకు నిర్వహిస్తామని నిర్వాహకులు చింతా శివరాంబాబు, కట్టుబోయిన వినయ్‌కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు, బహుమతి అందిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు 9966329218, 7601063051 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రెండో పూట విధులకు డుమ్మా



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ పీరయ్య

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాల్సిన బీఎల్వోలు మధ్యాహ్నం వరకు ఉండి తరువాత విధులకు డుమ్మాకొట్టారు. దీంతో పలు కేంద్రాల్లో ఓట్లు ఉన్నాయో లేదో పరిశీలించుకునేందుకు వచ్చిన ఓటర్లకు నిరాశ తప్పలేదు. పోయిన తమ ఓటును చేర్చుకుందామని వచ్చిన వారు బీఎల్వోలు అందుబాటులో లేకపోవడంతో నిరాశగా వెనుదిరగాల్సిన పరిస్థితి. నూజివీడు పట్టణ పరిధిలో 48 పోలింగ్ బూత్‌లున్నాయి. గాంధీనగర్, అప్పారావుపేట, పంచాయతీరాజ్ కార్యాలయం, గొడుగువారి గూడెం తదితర ప్రదేశాల్లో బీఎల్వోలు మధ్యాహ్నం నుంచి అందుబాటులో లేరని జనసేన సభ్యులు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ముత్యాల కామేశ్ వాపోయారు. మున్సిపల్ కమిషనర్ కొరపాటి పీరయ్య 173, 174, 175 కేంద్రాలను తనిఖీ చేశారు. ఎక్కడైనా బీఎల్వోలు అందుబాటులో లేకపోతే అక్కడి ఓటర్లు నేరుగా తనని సంప్రదించాలని కోరారు. కమిషనర్ వెంట ఆర్ఐ నరసింహారావు, టీపీవో వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

బీఎల్వోలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు.. **ముదినేపల్లి, మండవల్లి, న్యూస్‌టుడే:** ముదినేపల్లి, మండవల్లి మండలాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల శిబిరాల్లో యువత ఓట్లను నమోదు చేసుకున్నారు. మండవల్లి తహసీల్దారు బాజీ సత్యనారాయణ ప్రత్యేకంగా ఓటరు నమోదు శిబిరాలను సందర్శించి బీఎల్వోలు విధులు సక్రమంగా నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ముదినేపల్లి మండలం సింగరాయపాలెం నుంచి శ్రీహరిపురం బూత్‌లోకి వెళ్లిన 141 ఓట్లను డీటీ పవన్‌కుమార్, వీఆర్వో రామసుబ్బయ్య ఆధ్వర్యంలో తిరిగి సింగరాయపాలెం బూత్‌లోకి చేర్చారు. ఇందులో ఆయా గ్రామాల బీఎల్వోలు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర



ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గంగానమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. శ్రీహరిపురం, ముదినేపల్లి, వైవాక, వడాలి, పెదగొన్నూరు గ్రామాల్లో కనక డప్పులు, డీజే సౌండ్స్ మధ్య అమ్మవారి కలశాలను పుర వీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ఊరేగింపునకు భక్తులు పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలను నిర్వహించారు. శ్రీహరిపురంలో అమ్మవారికి గాజులతో చేసిన అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.

మండవల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో గంగానమ్మ జాతర ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. భైరవపట్నం శివారు శోభనాద్రిపురం, ఉనికిలిలో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పసుపు కుంకుమలతో చల్ల నైవేద్యాలను సమర్పించారు. అనంతరం తీన్‌మార్ డప్పులు, సన్నాయి మేళాల నడుమ అమ్మవారి కలశాలను పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. అమ్మవారి ఊరేగింపునకు భక్తులు అడుగడుగునా ముగ్గులు నీళ్లు పోసి, పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో వివిధ వేషధారణలు, కళాకారుల డప్పు విన్యాసాలు అందర్ని ఆకట్టుకున్నాయి.

రైతన్నకు అండగా.. సోదరిలా తోడుగా

● మెలకువలను తెలియజేస్తూ..

● ఆదర్శంగా నిలుస్తున్న మహిళా ఉద్యోగులు

కైకలూరు, ముదినేపల్లి, న్యూస్‌టుడే: హలం పట్టే రైతన్నల కష్టాలను క్షేత్ర స్థాయిలో గుర్తించి వ్యవసాయంలో మెలకువలను నేర్పించి ఆదర్శ రైతులుగా తీర్చిదిద్దగలమని నిరూపిస్తున్నారు ఈ అతివలు. దేశానికి అన్నం పెట్టే రైతులకు ఓ సోదరిగా సేవ చేయాలనే సంకల్పంతో వీరు ఈ రంగాన్ని ఎంచుకున్నారు. పేరుకు రైతుసేవా కేంద్రాల్లో ఉద్యోగులైనా నిరంతరం పొలంబాట పడుతూ రైతులతో మమేకమై కష్ట, నష్టాల్లో తోడుగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నియోజకవర్గంలో 22 మంది గ్రామ వ్యవసాయ సహాయకులు ఉండగా ఇందులో 11 మంది మహిళలే కావడం విశేషం.

సాగుపై ప్రత్యేక శ్రద్ధ

వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చినవారే కావడంతో సివంగుల్లా సేవతో కూడిన విధులు నిర్వహించడం అందరిని ఆకట్టుకుంటోంది. ఎల్‌నినో ప్రభావం ఏ రైతుపై పడకూడదనే ధ్యేయంతో సాగుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రైతన్నకు నేస్తాలుగా ఉంటూ సాగులో పాటించాల్సిన జాగ్రత్తలు, పంటల ఎంపిక, విత్తన శుద్ధి, ఎరువుల వినియోగం, పురుగు మందుల వాడకం, కలుపు నివారణ, నీటి యాజమాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

అన్నదాత నష్టపోకూడదనే..



వ్యవసాయ కుటుంబం నుంచి రావడంతో రైతు బిడ్డగా వారి కష్టాలు తెలుసు. ఎల్‌నినోతో రైతులు నష్టపోకూడదనే లక్ష్యంగా ఏ సమస్య చెప్పినా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నా. శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారుల నుంచి ఏ సమాచారం వచ్చినా రైతులకు చేరవేస్తున్నా. వాతావరణ పరిస్థితులను వివరిస్తూనే దిగుబడి సాధించే మెలకువలు, జాగ్రత్తలు సూచిస్తున్నా. **- అబ్దుల్ హస్‌గారీ, రాచపట్నం**

నా సమస్యగానే భావిస్తా



ఆడ పిల్లనైనా వ్యవసాయంపై మక్కువ. రైతుల సమస్యలను నా సమస్యగానే భావిస్తా. పంటల సాగులో ఏ అవసరమైనా పొలానికి వెళ్లి పరిశీలించి అవసరమైన సూచనలిస్తున్నా. పంటపై మచ్చలు, పురుగులు, తెగుళ్ల లక్షణాలు కనిపిస్తే వెంటనే రైతులను అప్రమత్తం చేసి అవసరమైన మందులు వాడిస్తున్నా. పరిస్థితిని బట్టి చరవాణిలో శాస్త్రవేత్తలతో చర్చించి రైతులకు సూచనలిస్తున్నా. **- చింతా బిందు, తామరకొల్లు**

పరిష్కారాలు సూచిస్తా..



మా సేవలు కార్యాలయానికే పరిమితం కావు. పొలాలకు వెళ్లి పంటలను పరిశీలించి ప్రతి సమస్యను పరిష్కరిస్తూ అందుబాటులో ఉంటున్నా. అవసరం మేరకు ఏ మందులు వినియోగించాలో చెబుతున్నా. అధిక మోతాదుతో వచ్చే నష్టాలను వివరిస్తున్నా. పెట్టుబడి అధికం కాకుండా ప్రకృతి కషాయాల తయారీలోనూ సహకరిస్తున్నా. **- కరణం హేమలత, సింగరాయపాలెం**

రైతు సేవ కోసమే ఈ రంగం



రైతుసేవ కోసం ఈ రంగాన్ని ఎంచుకున్నా. ఎండైనా, వానైనా పొలంబాట పట్టి రైతులకు సూచనలిస్తున్నా. వారు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు చెబుతా. పంటలు బాగా పండి రైతు సుభిక్షంగా ఉంటే మా సేవకు నిజమైన ఫలితం వచ్చిందని భావిస్తా. **- జి.ప్రియాంక, ముదినేపల్లి**

రూ.1.50కే యూనిట్ విద్యుత్తు అక్కర్లేదా?

● అప్సడా రిజిస్ట్రేషన్ నమోదులో సాగుదారుల అశ్రద్ధ ● కైకలూరు నియోజకవర్గంలో 50 శాతమే నమోదు



కలిదిండి, న్యూస్‌టుడే : అప్సడా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఆక్వా చెరువుకు మాత్రమే యూనిట్ విద్యుత్తు రూ.1.50కు అందిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాది నుంచి పదే పదే చెబుతున్నా సాగుదారులు అశ్రద్ధ చేస్తున్నారు. ఓ వైపు మత్స్య శాఖ అధికారులు, ఇంకో వైపు స్వయంగా కలెక్టర్ వెట్రిసెల్వి రైతులకు ఎన్నో అవగాహన సదస్సులు నిర్వహించినా ఆశించిన స్థాయిలో రిజిస్ట్రేషన్లు నమోదు కాలేదు.

ఇంకా సగం మందే..

కైకకలూరు నియోజకవర్గంలో అత్యధికంగా 84,778 ఎకరాల్లో ఆక్వా సాగువుతోంది. కానీ.. ఇక్కడే రిజిస్ట్రేషన్ల నమోదు వెనకంజలో ఉంది. ఇప్పటి వరకు కేవలం 41,992 ఎకరాలు మాత్రమే నమోదయ్యాయి. ఇంకా 42,786 ఎకరాలు నమోదు కావాల్సి ఉంది.

మంచి అవకాశం..

వైకాపా హయాంలో విస్తీర్ణం, జోన్ల నిబంధనలతో ఎక్కువ మంది రైతులకు విద్యుత్తు రాయితీ అందలేదు. ఇప్పుడు వాటితో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ పూర్తయిన చెరువులకు యూనిట్ విద్యుత్తు రూ.1.50కు అందించనున్నారు. ఈ మేరకు ఇటీవలే జీవో విడుదలైంది.

రైతులు ముందుకు రావాలి..

అప్సడా రిజిస్ట్రేషన్‌కు రైతులు ముందుకు రావాలి. ఏమైనా ఇబ్బందులు, సందేహాలు ఉంటే వాటిని పరిష్కరిస్తాం. ప్రతి రైతుకూ రాయితీ దక్కాలనే ప్రభుత్వ ధ్యేయం నెరవేర్చే దిశగా కృషి చేస్తున్నాం. **- రవికుమార్, మత్స్య శాఖ ఏడీఏ, కైకలూరు**

తెదేపా సీనియర్ నేత కొల్లి మృతి



చాట్రాయి, న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నాయకులు కొల్లి వరప్రసాద్(72) ఆదివారం సాయంత్రం జయపురంలో మృతి చెందారు. ఆయన తుమ్మగూడెం ఎంపీటీసీ సభ్యుడిగా ఎన్నికై మండల పరిషత్తు ఉపాధ్యక్షుడిగా గతంలో ఉన్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వరప్రసాద్ తండ్రి దివంగత మాధవరావు తుమ్మగూడెం సర్పంచిగా సుమారు 40 ఏళ్లు పని చేశారు. తెదేపాలో ప్రసాద్ కీలక నేతగా పని చేస్తూ ఇటీవల అస్వస్థతకు గురై గృహానికే పరిమితమయ్యారు. పలువురు నాయకులు వరప్రసాద్ మృతికి సంతాపం తెలిపారు.

తొట్టంతా నాచు.. తాగేదెట్టా



ముసునూరు, న్యూస్‌టుడే: పశువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి తొట్టెల్లో నీరు అపరిశుభ్రంగా మారింది. ముసునూరు మండలం వ్యాప్తంగా చాలాకాలం నుంచి నీటి తొట్టెలను శుభ్రం చేసిన దాఖలాలు లేవు. శుభ్రం చేయకుండా నీరు నింపుతుండటంతో పాచి పట్టి దుర్వాసన వస్తున్నాయని, తొట్టెలను శుభ్రం చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పశు పోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాచి పట్టి ఉండటంతో ఈ నీరు తాగితే పశువులకు రోగాల బారిన పడే అవకాశం ఉందని పశు పోషకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తొట్టెలను శుభ్రం చేయాలని కోరుతున్నారు. ఎంపీడీవో ఏసుబాబును వివరణ కోరగా సిబ్బందిని పంపించి తొట్టెలను వెంటనే శుభ్రం చేయిస్తామన్నారు.

జనరిక్ మందుల షాపులో అవకతవకలపై ఫిర్యాదు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నడుపుతున్న నూజివీడు జనరిక్ మెడికల్ షాపులో నిధుల దుర్వినియోగంపై సీనియర్ సిటిజన్స్ సంఘం సభ్యులు పట్టణ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. వివరాలను ఆదివారం విలేకరులకు తెలిపారు. ఎస్పీ బాపనయ్య, జి.మురళీమోహనరావు, ఆర్‌కే నారాయణ మూర్తి, కేవీ సుబ్బారావు తదితరులు మాట్లాడారు. రూ.5లక్షల విలువైన సరకు, లెక్కలు తేడా వచ్చినట్లు పేర్కొన్నారు. పోలీసు అధికారులు స్పందించి సీనియర్ సిటిజన్స్ సమక్షంలో షాపును తెరచి స్టాక్ అప్పజెప్పించడంతో పాటు సీనియర్ సిటిజన్స్ మందుల కోసం ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

పాల ధర పెంపుతో 1.50 లక్షల మందికి మేలు



కల్యాణమస్తులో బంగారు నాణెం అందిస్తున్న మిల్క్ యూనియన్ డైరెక్టర్ రామచంద్రరావు

చాట్రాయి, న్యూస్‌టుడే: పాల ధర పెంపుతో ఉమ్మడి కృష్ణా జిల్లాలో 1.50 లక్షల మంది పాడి రైతులకు మేలు జరుగుతుందని కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు తెలిపారు. మర్లపాలెం, టి.గుడిపాడు, తుమ్మగూడెం పాల సేకరణ సంఘాల పరిధిలో సభ్యుల కుటుంబ సభ్యులు హరిత, వాసవి, సాయి త్రితీశ్ వివాహాలను పురస్కరించుకుని ఆయన బంగారు నాణేలను ఆదివారం అందించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 373 సంఘాల్లో సభ్యులకు మేలు చేసేలా లీటరుకు రూ.3 పెంచామన్నారు. ప్రతి వంద రూపాయలకు పది రూపాయలు బోనస్‌గా ఏడాదిలో మూడు విడతలుగా పంపిణీ చేస్తున్నారు. వెన్న 11 శాతం ఉన్న రైతులకు లీటరుకు రూ.95 సైతం వస్తుందని తెలిపారు. పాడి రైతులు ఎల్‌నినో నేపథ్యంలో పాల ఉత్పత్తి తగ్గకుండా పశు పోషణపై దృష్టి సారించాలని కోరారు. మిల్క్ యూనియన్ అందించే రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంఘాధ్యక్షుడు ఎంవీ రాఘవరావు, బలుసు రాజ్యలక్ష్మి, చాగంటి శేషగిరిరావు, సూపర్‌వైజర్ బి.శివ నాగేశ్వరరావు, కార్యదర్శులు మహేశ్వరరావు, తాతయ్యబాబు, అద్దంకి సత్యనారాయణ, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల చోరుడి అరెస్టు

కైకలూరు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలు చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని ఆదివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు కైకలూరు గ్రామీణ ఠాణా ఎస్సై రాంబాబు తెలిపారు. ఇటీవల ద్విచక్ర వాహనం చోరీ జరిగిన ఘటనపై మండలంలోని నత్తగుళ్లపాడుకు చెందిన రాంపాలుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని పల్లెవాడలో ఆదివారం ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్సై సిబ్బందితో కలిసి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా నరసాపురానికి చెందిన పాత నిందితుడు బొబ్బిలి భాస్కరరావుగా గుర్తించారు. గతంలో ఇతను అనేక పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు చెప్పారు. ఆయన నుంచి మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

సుత్తితో దాడి చేసిన వ్యక్తి .. **నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** మండలంలోని పోతురెడ్డిపల్లిలో గొర్ల ప్రసాద్ అనే వ్యక్తిపై సుత్తితో దాడి చేసి తల పగలగొట్టిన గరికపూడి ప్రభాకరరావును ఆదివారం అరెస్టు చేసినట్లు నూజివీడు రూరల్ ఎస్ఐ జ్యోతిబాసు తెలిపారు. నిందితుడ్ని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు చెప్పారు.

శివ నాగేంద్రస్వామి దేవస్థానానికి వితరణ

కైకలూరు, న్యూస్‌టుడే: కరకట్ట కాలనీలో కొలువుదీరిన శివ నాగేంద్రస్వామి వారి దేవస్థానానికి కైకలూరుకు చెందిన నరహరిశెట్టి శ్యాంబాబు రూ.37 వేలు విలువ చేసే మైకు సెట్టు సమర్పించారు. అంతకు ముందు స్వామివారికి పలు రకాల అభిషేకాలు, పరిమళ పుష్పాలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దాతను శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. సత్యనారాయణ, శ్రీనివాసరావు, రాధాకృష్ణ, నాగరాజు, బ్రహ్మం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ అంచుల్లోకి వెళ్తే.. అంతే సంగతులు



చాట్రాయి, న్యూస్‌టుడే: పోలవరం - వెలగలపల్లి రహదారిలో మంకొల్లు సమీపంలో పోతనపల్లి అడ్డరోడ్డు వద్ద రహదారి అంచులు కోసుకుపోయాయి. ఇక్కడే ప్రమాదకర మలుపు కూడా ఉంది. సమీపానికి వచ్చే వరకు ఎదురుగా వాహనం కనిపించదు. దీంతో ఇక్కడ ప్రమాదకరంగా మారింది. చోదకులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా గాయాల పాలయ్యే అవకాశముంది. ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు ప్రయాణాలు చేస్తుంటాయి. రహదారి విస్తరణ చేయక మరింత ప్రమాదకరంగా మారింది. రహదారి పల్లపు ప్రాంతంలో ఉండగా చిన్నపాటి వర్షమొస్తే వరద నీటితో తరచూ కోతకు గురవుతోంది. ఇప్పటికైనా ర.భ.శాఖ అధికారులు స్పందించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని చోదకులు కోరుతున్నారు.

డంపింగ్ యార్డు ఉన్నా.. ప్రయోజనం సున్నా..



నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో డంపింగ్ యార్డు ఉన్నప్పటికి ప్రయోజనం శూన్యంగానే ఉంది. అనేకసార్లు రామన్నగూడెం వెళ్లే రహదారి మార్జిన్‌లో చెత్త పోస్తున్నారని మున్సిపల్ కమిషనర్ పీరయ్య దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన స్పందించి చెత్త తొలగించి డంపింగ్ యార్డులో పోయిస్తున్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య సిబ్బంది బాధ్యతారాహిత్యంతో ఒకే పనిని రెండు సార్లు చేయాల్సిన పరిస్థితి. రామన్నగూడెం, వట్టిగుడిపాడు వెళ్లే ప్రజలు చెత్త, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది.

నీరు వృథా.. ఆపై గొయ్యి..



జాతీయ రహదారిపై పైపులు పగిలి ఇలా..

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండల కేంద్రంలో జాతీయ రహదారి కింద ఉన్న రక్షిత మంచి నీటి పైపులు పగిలి పోవడంతో నీరు వృథాగా పోతోంది. జాతీయ రహదారి 165 విస్తరణ సమయంలో రోడ్డుకు ఇటువైపు నుంచి అటు వైపునకు పైపులు వేశారు. నాణ్యమైన పైపులు వేయకపోవడంతో రోడ్డు కింద ఉన్న పైపులు భారీ వాహనాల ఒత్తిడికి పగిలి పోయాయి. నిత్యం రోడ్డుపై నీరు లీకవడంతో ఆ ప్రాంతంలో పెద్ద గొయ్యి ఏర్పడింది. నీరు వృథాగా పోవడంతో పాటు గొయ్యితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై కార్యదర్శి రాధికను వివరణ కోరగా.. పైపులు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.